నేటి కందం-నేటికి అందం

తెలివిగల యువతరములో
పలువురిని నియుక్తి జేయు పత్రచయంబున్
తలపోయుచు దేశభవిత
విలువలు గలిగిన ప్రధాని వితరణ జేసెన్ !!
(ఇరవయ్యవ ఉపాధి కల్పనా సమ్మేళనం నిర్వహించి ఒక్కరోజే సలభై ఐదు కేంద్రాలలో యాభై యొక్క వేల మందికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా నియామక పత్రాలను వితరణ చేశారు . ఇది అద్భుతం అని (ప్రజలు ఆనందిస్తున్నారు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ఆరోపణ్ల పాలపొంగు
అయితే కాదా వ్యర్థం
ప్రభుత్వం తేల్చకుంటే
ప్రగల్భాలే వాటి అర్థం
గత పాలక అవినీతి
గతులేనా ఎప్పుడూ
వల్లిస్తే తగ్గిపోదా
విశ్వాసం చప్పుడూ



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ ఆదివారం 20-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:43 పేజీలు:6 వెల: రూ.1/-


## మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివృద్ధి పనులపై మంత్రి సీతక్క సమీక్ష



**-త్వరలో మల్లూరు క్షేత్రంలో పర్యటించి అభివృద్ధి పనుల డిజైన్ ఖరారు చేయాలని నిర్ణయం**
**-కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం తదితర సౌకర్యాల అభివృద్ధికి చర్యలు**
**- దేవాలయ పవిత్రతకు, ప్రస్తుత నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశం**

ములుగు, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.


ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు ప్రముఖ ఆర్కిటెక్టులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యం, చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులలో భాగంగా కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం వంటి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడంపై సమావేశంలో చర్చించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

అదేవిధంగా, దేవాలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదా డిస్టర్బెన్స్ కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణ స్వరూపం, పరిసర ప్రాంతాల ప్రత్యేకత, భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్టులు, అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్‌ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దేవాలయ అభివృద్ధికి అనువైన డిజైన్‌ను ఖరారు చేయనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యం తదితర అంశాలను నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. రాక్ టెస్ట్ నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, సమన్వయంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టాలని అధికారులకు సూచించారు

## చీర్లవంచలో సాయి చరణ్‌కు నాయకుల నివాళులు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): చీర్లవంచ (ఆర్అండ్ఆర్ కాలనీ) గ్రామ మాజీ ఉపసర్పంచ్ సంధనాల శ్రీనివాస్ కుమారుడు సంధనాల సాయి చరణ్ (23) మృతిచెందడంతో పలువురు నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ ఎంపీపీ బూర వజ్రమ్మ-బాబు, సర్పంచులు ముత్త సంజన-మహేష్, ఊరడి సునీత-రాజిరెడ్డి, మాజీ సర్పంచులు రంగు సత్తవ్వ-రాములు, కొండపల్లి వెంకటరమణ, వెంకటేష్, భాస్కర్‌గౌడ్, నడిగోట్ల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## స్టార్టప్‌లే భారతదేశపు యువత సత్తాకు నిదర్శనం..!



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికిపైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందన్నారు. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఇది భారతదేశ నూతన ఆర్థికవ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా స్టార్టప్‌ల స్థాపనలో కీలకపాత్ర పోషిస్తున్నారని చూపిస్తోందని వివరించారు.

చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ తమతోపాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఈ లక్ష్యంతోనే సుమారు రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుందన్నారు.

మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతోపాటు కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. మీరు మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలని ప్రధాని అన్నారు. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐగాట్ కర్మ యోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరేవారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని చెప్పారు.

## విధి నిర్వహణలో గాయపడిన కార్మికుడికి సాయం చేయాలి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతున్న గ్రామపంచాయతీ వాటర్ సప్లై కార్మికుడు పసుల ముత్తయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. చింతల్‌థానా ఆర్అండ్ఆర్ గ్రామంలో నాలుగేళ్లుగా వాటర్ సప్లై కార్మికుడిగా పనిచేస్తున్న ముత్తయ్య గత నెల రెండో శనివారం విధుల్లో ఉండగా కాలికి గాయమైంది. గాయం సెప్టిక్ కావడంతో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారని, చికిత్సకు సుమారు రూ.2 లక్షలు ఖర్చయ్యాయని తెలిపారు. ఇప్పటివరకు అధికారులు కార్మికుడిని పరామర్శించకపోవడం విచారకరమన్నారు. విధి నిర్వహణలో గాయపడినందున కార్మికుడికి నష్టపరిహారం, ఆగిపోయిన 15 రోజుల వేతనం, తక్షణ ఆర్థిక సాయం అందించాలని రాములు డిమాండ్ చేశారు. అనంతరం ఆయన ముత్తయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## హఫీజ్‌పేట్ ఘటన.. హోంగార్డ్ ఆనంద్‌పై వేటు

హైదరాబాద్, సెప్టెంబర్ 19: నగరంలోని హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ వద్ద మహిళపై దాడి చేసిన ఘటనలో హోంగార్డ్‌పై వేటు పడింది. హోంగార్డ్ ఆనంద్‌ను సర్వీసు నుంచి డిస్మిస్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వికారాబాద్‌కు చెందిన తెలంగాణ పోలీస్ హోంగార్డ్‌ను డిస్మిస్ చేస్తూ ఆ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే మహిళపై దాడి ఘటనలో ఆనంద్‌పై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు ఈ ఘటనపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్ అయ్యారు. వెంటనే హోంగార్డ్ ఆనంద్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది ఏ స్థాయి వారైనా.. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఇలాంటి ప్రవర్తనను క్షమించలేమన్నారు. ఇది శిక్షణ, ఆదేశాలకు విరుద్ధమని తెలిపారు. మహిళ పట్ల హోంగార్డ్ ప్రవర్తన ఖండించదగినదని డీజీపీ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వికసిత్ భారత్ లక్ష్యంలో తెలంగాణ కీలక పాత్ర: భట్టి విక్రమార్క

హైదరాబాద్, సెప్టెంబర్ 19: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఉన్న స్థాయి నుంచి 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందుకోసం కేవలం ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానానికి పరిమితం కాకుండా ప్రైవేట్, సంస్థాగత పెట్టుబడులను పెద్ద ఎత్తున సమీకరించే దిశగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను తీసుకురావడంతో పాటు యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని, వారి నైపుణ్యాలు, ప్రతిభను వినియోగించుకునేలా ఆర్థికాభివృద్ధి, ఉపాధి రంగాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ సమతుల్య అభివృద్ధి ఫలాలు అందేలా అజఖీఇ?ఖజఖీఇ?ఖీంఖీఇ విధానాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను సృష్టించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. దేశాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కేంద్రం.. రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పనిచేయాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్రం?రాష్ట్రాల మధ్య సమన్వయం, పెట్టుబడుల ప్రోత్సాహం, యువతకు అవకాశాల కల్పనతో తెలంగాణను వేగవంతమైన ఆర్థికాభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## శంషాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 19:శివారు శంషాబాద్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పాలమాకుల వద్ద వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి కల్వర్ట్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు.

మృతులను ఎస్టీ (లంబాడ) సామాజిక వర్గానికి చెందిన వ్యాపారవేత్త కేతావత్ లింబ్య(54), కేతావత్ జమున (45), కత్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వాగ్రం(45)గా గుర్తించారు. వీరంతా తమ స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెట్టుగడ్డతండా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ అశోక్ తీవ్రంగా గాయపడ్డారు.

కాగా, ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌నే కారణమని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పేదలకు పట్టాభిషేకం.. 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు

**విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 28,445 పేద కుటుంబాలకు ఇంటి హక్కు పట్టాలను పంపిణీ చేశారు.**
**పేదలకు పట్టాభిషేకం.. 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలు**

విశాఖపట్నం, సెప్టెంబర్ 19: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో 11 మండలాలకు చెందిన 28,445 కుటుంబాలకు ఇంటి హక్కు పట్టాలను సీఎం పంపిణీ చేశారు. మొత్తం రూ.8,874 కోట్ల విలువైన భూమికి సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పేదల ఇళ్ల కోసం ప్రభుత్వం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. దశాబ్దాలుగా ఇళ్లపై ఉన్న అనిశ్చితికి ఈ పట్టాలతో ముగింపు పలుకుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఇకపై లబ్ధిదారులు తమ ఇళ్లపై పూర్తి హక్కులు కలిగి ఉంటారని చెప్పారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సొంతిల్లు ఉండాలనేది ప్రతి మనిషి కల అని అన్నారు. పేదలకు సొంత ఇళ్లు ఉండాలన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. 'మీరు ఉంటున్న ఇళ్లపై సర్వహక్కులు ఇక నుంచి మీవే. మీ ఇళ్లపై ఎలాంటి వివాదం లేదు.. భయం లేదు' అని చంద్రబాబు అన్నారు. పట్టాలు పొందిన తర్వాత అవసరమైతే ఇళ్లపై బ్యాంకు రుణాలు కూడా తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇళ్ల హక్కు పత్రాలు అందుకోవడం ద్వారా పేద కుటుంబాలకు ఆస్తిపై భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువను పూర్తి చేసి అనకాపల్లికి నీటిని అందించడంతో పాటు విశాఖకు గోదావరి జలాలను తీసుకొస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో గత రెండేళ్లలో 91 ప్రాజెక్టులు వచ్చాయని, ఈ ప్రాంతానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించామని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తంగా రూ.5.37 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ నగరం త్వరలో విశ్వనగరంగా ఎదగనుందని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు గేమ్‌చేంజర్‌గా మారనుందని తెలిపారు. విశాఖలో నీటి సమస్య లేకుండా వచ్చే ఏడాదిలోగా పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, భవిష్యత్తులో నీటి కొరత రాకుండా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తిరుపతిలో 89.41 శాతం పచ్చదనం ఉందని, విశాఖను కూడా అదే స్థాయికి తీసుకెళ్లాలనేది తన లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అనేక భూ కుంభకోణాలు ఉన్నాయని చంద్రబాబు ఆరోపించారు. వాటన్నింటినీ అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రశాంతమైన ఉత్తరాంధ్రలో శాంతి లేకుండా చేశారని విమర్శించారు. రుషికొండలో నిర్మించిన భవనాలను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఎన్ని డేటా సెంటర్లు వచ్చినా విశాఖకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కూటమి ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకు వేస్తోందని, పేదలకు ఇస్తున్న పట్టాలు వారి పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం వంటివని అన్నారు. అప్పుల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తెచ్చామని, రైల్వే జోన్ రావడంతో విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు పేర్కొన్నారు.

# విశ్వవిద్యాలయాలు క్రీడలకు పుట్టినిల్లు కాలేవా !

## (సెప్టెంబర్ 20న "అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడా దినోత్సవం" సందర్భంగా)

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 20న పాటించే అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడా దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ యూనివర్సిటీ స్పోర్ట్) నిర్వహించడం 2016 నుండి కొనసాగుతోంది. విశ్వవిద్యాలయాలు, వాటి చుట్టూ ఉన్న స్థానిక కమిటీలు కలిసి క్రీడలతో అవిభాజ్య సంబంధాలను ఏర్పరచడంలో ఆటలు సహాయపడుతుంది. క్రీడాకారులకు శారీరక శ్రమ, శరీర శక్తిని మెరుగుపరచడం, అవయువాల సమన్వయం, ఉపాధి అవకాశాలు, ఆరోగ్యకరమైన జీవనం కోసం పేరు ప్రఖ్యాతులను ఆటలు అందిస్తాయి. యువతను ఇండోర్‌తో పాటు అవుట్‌డోర్ ఆటలు ఆడేలా ప్రోత్సహించడానికి ఈ దినోత్సవాన్ని 2016లో యునెస్కో (ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్ర మరియు సాంస్కృతిక సంస్థ) ప్రకటించింది. ఈ సంవత్సరం యునెస్కో ప్రారంభించిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడా దినోత్సవానికి 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. 20 సెప్టెంబర్ 1924లో జరిగిన మొదటి "ప్రపంచ విద్యార్థి ఛాంపియన్‌షిప్" జరిగిన తేదీతో ఇది సరిపోలడం వలన ఈ తేదీని ఎంచుకున్నారు. విశ్వవిద్యాలయాలలో క్రీడల ప్రాముఖ్యతను, అలాగే సమాజ సేవలో క్రీడా విద్యను పటిష్టం చేయడంలో విశ్వవిద్యాలయాల సామాజిక పాత్రను తెలియజేయడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఇది ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సంభాషణకు కేంద్రంగా ఉంటూ, క్రీడల విలువలను ప్రోత్సహిస్తుంది.

### అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడా దినోత్సవం-2026 ఇతివృత్తం :

ఈ సంవత్సరం, అంతర్జాతీయ విశ్వవిద్యాలయ క్రీడా దినోత్సవ శుభ సందర్భంగా, విశ్వవిద్యాలయ క్రీడా కుటుంబం మొత్తం "10 సంవత్సరాలు - 10 కిలోమీటర్లు" అనే ఇతివృత్తంతో ఒకే ప్రపంచ స్థాయి కార్యక్రమంలో పాల్గొనాలని, అలాగే క్రీడా సంఘాలు కలిసి 10 కిలోమీటర్ల నడక, పరుగు లేదా శారీరక కదలికను నిర్వహించాలని సూచించడమైనది. విశ్వవిద్యాలయ విద్యార్థులు, సమాజం, సిబ్బంది, క్రీడా సంఘాలు, క్రీడాభిమానులు డిజిటల్ యుగపు పిల్లలు మరియు యువతను ప్రేరేపించడానికి పెద్ద కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రయత్నించాలి. క్రీడలు, విద్య, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనం మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించడానికి "ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ యూనియన్ (ఈమోజ)", యునెస్కో సహకారంతో ఈ దినోత్సవాన్ని జరుపుకుంటుంది.

### క్రీడల ప్రాముఖ్యత:

విశ్వవిద్యాలయ పరిధిలో తోటి ఇరుగుపొరుగు సమూహాలతో సాధన చేసినప్పుడు, యువత జీవితంలోని కీలక దశలో క్రీడలు వారి వ్యక్తిగత, సామూహిక అభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా ఉంటాయి. క్రీడలు నిష్పక్షపాత క్రీడాస్ఫూర్తి, గౌరవం, జట్టు స్ఫూర్తి, బాధ్యత, పట్టుదల, ఉపాధి, ప్రజాదరణ వంటి అవసరమైన విలువలను ప్రోత్సహిస్తున్న విద్యార్థుల క్రమశిక్షణను స్ఫూర్తిదాయకంగా సుసంపన్నం చేస్తాయి. క్రీడా పోటీలు, వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సామాజిక క్రీడా కార్యక్రమాలు, ఆన్‌లైన్ స్పోర్ట్స్ క్విజ్‌లు, మరెన్నో సంబంధిత కార్యకలాపాలు ఇందులో భాగంగా ఉంటాయి.

శారీరక విద్యా విభాగాల నినాదం "చురుకైన మనస్సుకు దృఢమైన శరీరం (సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ)" అనేది, శారీరక దృఢత్వంతో ఎక్కువగా ముడిపడి ఉన్న మానసిక ఆరోగ్యాన్ని ప్రతిబింబిస్తుంది, ఇది కేవలం బహిరంగ ఆటల ద్వారా మాత్రమే సుసాధ్యం అవుతుందని గమనించి మన పిల్లలకు క్డీడల పట్ల ఆసక్తి పెరగడానికి అవకాశం ఇవ్వాలి.



-మధుపాళీ
9949700037

# రాష్ట్రాల పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి.. అందుకే ప్రాంతీయ వ్యవసాయ సదస్సులు అవసరం: శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వ్యవసాయ సదస్సులో ప్రసంగించారు. ఈ ప్రాంత వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, అవకాశాలపై సదస్సులో చర్చలు జరిగాయి. ఎల్‌నినో ప్రభావం, పంటల వైవిధ్యీకరణ, రాబోయే రబీ సీజన్ అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ చర్చలు కేవలం అభిప్రాయాల మార్పిడి కోసం కాదని, రైతుల జీవితాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడం, దేశ ఆహార భద్రతను బలోపేతం చేయడం, వ్యవసాయం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం, వ్యవసాయ రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురావడమే లక్ష్యమని శ్రీ చౌహాన్ అన్నారు. "దేశమే మొదటి ప్రాధాన్యం" అనేది ప్రభుత్వ మార్గదర్శక సూత్రమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉందన్న దానిని పరిగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ సమస్యలను కేంద్రం పరిశీలిస్తుందని చెప్పారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడే పరిష్కారాలే తమ లక్ష్యమని అన్నారు.

కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలు ప్రపంచాన్ని మారుస్తూనే ఉంటాయని, అయినప్పటికీ వ్యవసాయానికి ప్రత్యామ్నాయం లేదని శ్రీ చౌహాన్ అన్నారు. "పండ్లు, కూరగాయలు, ధాన్యాలు పొలాల నుంచే వస్తాయి. వాటిని పండించేది రైతులే. వ్యవసాయం లేకుండా ప్రపంచం నడవదు" అని ఆయన చెప్పారు. యంత్రం రొట్టె తయారు చేయగలదేమో కానీ గోధుమను ఉత్పత్తి చేయలేదని అన్నారు. "ధాన్యం ఎప్పటికీ పొలంలోనే పండాలి. అందుకే రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు, జీవనదాత కూడా" అని పేర్కొన్నారు. రైతులకు సేవ చేయడం అంటే తనకు దేవునికి సేవ చేసినట్టేనని, ఎందుకంటే వ్యవసాయం మానవ జీవితానికి మూలాధారమని ఆయన చెప్పారు. భారత వ్యవసాయ రంగానికి మూడు ప్రధాన లక్ష్యాలను ఆయన వివరించారు. మొదటిది 140 కోట్లకు పైగా జనాభాకు ఆహార భద్రత కల్పించడం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది మరింత కీలకమైందని, ఆహార అవసరాల కోసం భారత్ ఇతర దేశాలపై ఆధారపడలేదని అన్నారు. రెండో లక్ష్యం రైతుల జీవనోపాధిని భద్రపరచడం. దేశానికి అన్నం పెట్టే రైతు కూడా సురక్షితంగా, సుసంపన్నంగా జీవించాలని, రైతుల ఆదాయాలు పెరగడం ప్రధాన ప్రాధాన్యంగా ఉండాలని చెప్పారు. మూడో లక్ష్యం పోషకాహార భద్రత. ప్రజలకు కేవలం ఆహారం మాత్రమే కాకుండా పోషక విలువలు కలిగిన ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, కాఫీ, జీడిపప్పు, కోకో, గంధం వంటి ఉద్యాన పంటల సాగుకు దక్షిణ భారతదేశంలో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పోషకాహార భద్రత బలోపేతానికి కూడా ఈ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

భారత వ్యవసాయ రంగం విస్తృత వైవిధ్యంతో కూడుకున్నదని శ్రీ చౌహాన్ అన్నారు. గతంలో దేశవ్యాప్తంగా ఒకే రబీ సదస్సు నిర్వహించేవారని, అయితే రాష్ట్రాల వారీగా వాతావరణ పరిస్థితులు, వనరులు, నీటి లభ్యత, నేల స్వభావం భిన్నంగా ఉంటాయని చెప్పారు. "ఒకే చోట ఒక రోజు కూర్చొని మొత్తం దేశానికి ఒకే రబీ లేదా ఖరీఫ్ ప్రణాళిక రూపొందించడం సాధ్యం కాదు" అని అన్నారు. అందుకే రబీ సదస్సును ఒకరోజు నుంచి రెండు రోజులకు విస్తరించామని చెప్పారు. దీనివల్ల ప్రతి రాష్ట్రం తమ సమస్యలు, సవాళ్లు, సూచనలను అందించేందుకు ఒక అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్రం కూడా తన అంచనాలను రాష్ట్రాల ముందుంచి, సంయుక్తంగా వ్యవసాయ ప్రణాళికను రూపొందించగలదని అన్నారు. ప్రాంతీయ సదస్సుల ప్రాముఖ్యతను ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ కూడా నొక్కిచెప్పారని చెప్పారు. జమ్మూ కశ్మీర్, గుజరాత్ లేదా ఈశాన్య రాష్ట్రాలు ఎదుర్కొనే సవాళ్లు, ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణ ఎదుర్కొనే సవాళ్లు ఒకేలా ఉండవని అన్నారు. భౌగోళిక, వాతావరణ పరిస్థితులు వేర్వేరుగా ఉండటంతో వ్యవసాయ విధానాలు కూడా భిన్నంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ అవగాహనతోనే దక్షిణ ప్రాంతీయ వ్యవసాయ సదస్సు నిర్వహిస్తున్నామని, ప్రాంత అవసరాలకు తగిన పరిష్కారాలు రూపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

సంస్కరణలకు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, మార్పులు అవసరమైన నియమాలు, చట్టాలు, విధానాలను సమీక్షించాలని సూచించారని శ్రీ చౌహాన్ తెలిపారు. "నియమాలు ప్రజల కోసం ఉంటాయి. ప్రజలు నియమాల కోసం ఉండరు" అని ఆయన అన్నారు. కాలం చెల్లిన చట్టాలు, విధానాలను రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షించి అవసరమైన చోట మార్పులు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కారం అవసరమైన అంశాలను రాష్ట్రాలు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వం ఫైళ్లకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలని ప్రధాని మోదీ పదేపదే చెబుతున్నారని పేర్కొన్నారు. నియమాల్లో మార్పులు అవసరమైన చోట రాష్ట్రాలు తమ సూచనలు ఇవ్వాలని, కేంద్రం తన పరిధిలో సంస్కరణలు చేపడుతుందని చెప్పారు. రాష్ట్రాలు కూడా తమ అధికార పరిధిలో మార్పులు చేసి ప్రజలకు మరింత ఉపశమనం కల్పించాలని సూచించారు.

వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై సదస్సులో ప్రజెంటేషన్లు, చర్చలు జరుగుతాయని శ్రీ చౌహాన్ తెలిపారు. అనంతరం రైతులు, ఇతర భాగస్వాములతో స్వ వారి సూచనలు తీసుకుంటామని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను కూడా ప్రదర్శిస్తామని, ఒక రాష్ట్రంలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయం, ఉద్యాన పంటల రంగాల్లో దక్షిణ రాష్ట్రాలు విశేష కృషి చేశాయని, అందుకు అభినందనలు తెలియజేస్తూనే మరింత పురోగతికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. "భారత ప్రభుత్వం రాష్ట్రాలకు పూర్తి సహకారం అందిస్తుంది. భూమి రాష్ట్రాల వద్ద ఉంది... రైతులు రాష్ట్రాల్లో ఉన్నారు. కేంద్రం అన్ని విధాలుగా మద్దతు ఇస్తుంది. రెండూ కలిసి పని చేయాలి" అని చెప్పారు. "దేశమే మొదటి ప్రాధాన్యం" అనే సూత్రాన్ని మరోసారి ప్రస్తావిస్తూ వ్యవసాయాభివృద్ధికి కేంద్ర-రాష్ట్రాల సమన్వయం అత్యంత అవసరమని, ప్రాంతీయ సదస్సుల ప్రధాన ఉద్దేశం కూడా ఇదేనని పేర్కొన్నారు.

కొబ్బరి రంగంలో ఉన్న అవకాశాలను ప్రస్తావిస్తూ, భారత్ కొబ్బరి ఎగుమతులు ఒకే ఏడాదిలో రూ.4,349 కోట్ల నుంచి రూ.7,038 కోట్లకు పెరిగి 62 శాతం వృద్ధి నమోదు చేశాయని శ్రీ చౌహాన్ తెలిపారు. కొబ్బరి ప్రోత్సాహానికి కొత్త పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించామని, అది త్వరలో అమల్లోకి రానుందని చెప్పారు. దేశంలో కొబ్బరి ఉత్పత్తిలో దక్షిణ రాష్ట్రాలు ముందంజలో ఉన్నందున ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకునేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. పాత కొబ్బరి తోటల పునరుద్ధరణకు వ్యూహం రూపొందించాలని కూడా పిలుపునిచ్చారు. 60-70 సంవత్సరాల వయస్సు ఉన్న కొబ్బరి చెట్లు తక్కువ దిగుబడి ఇస్తాయని, నాణ్యత కూడా ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చని చెప్పారు. అందువల్ల దశలవారీగా పాత చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాష్ట్రాలు పరిశీ సూచించారు. జీడిపప్పు, కోకో పంటల ప్రోత్సాహ పథకాల కోసం కూడా రాష్ట్రాలు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలని, తద్వారా రైతులు గరిష్ఠ ప్రయోజనం పొందగలరని అన్నారు.

ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోని పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) కుదుర్చుకుందని శ్రీ చౌహాన్ తెలిపారు.

ఈ ఒప్పందాల వల్ల పండ్లు, కూరగాయలు, ధాన్యాలు సహా పలు వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశం సులభమైందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను గుర్తించేందుకు ఈ ఒప్పందాలను లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలని అన్నారు. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పండ్లు, కూరగాయలు, ధాన్యాలు ఉత్పత్తి చేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రపంచ మార్కెట్ల విస్తరణతో భారత రైతులు ప్రయోజనం పొందేలా వ్యవసాయ విలువ శ్రేణి అంతటా అంతర్జాతీయ ప్రమాణాలను అమలు చేయాలని సూచించారు. "భారత్‌కు ప్రపంచ మార్కెట్లు తెరుచుకుంటున్నాయి. ఇది రైతులకు గొప్ప అవకాశం" అని పేర్కొంటూ రబీ సీజన్‌తో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన ఇతర అంశాలపై కూడా అన్ని వర్గాలు గంభీరంగా చర్చించాలని కోరారు.

గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న శ్రీ చౌహాన్ మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద ఇళ్లను స్వీకరించలేదని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసిందని, 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన తొలి విడత నిధులను భారత ప్రభుత్వం తెలంగాణ ముఖ్యమంత్రికి అందజేసిందని తెలిపారు. ఈ 2 లక్షల ఇళ్ల నిర్మాణం ఇప్పుడు ప్రారంభమవుతుందని చెప్పారు. ఇంకా కచ్చా ఇళ్లలో నివసిస్తున్న, సర్వే ద్వారా గుర్తించిన లబ్ధిదారులను కూడా తదుపరి దశల్లో చేర్చుతామని అన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

దక్షిణ ప్రాంతీయ వ్యవసాయ సదస్సు ద్వారా కేంద్రం, దక్షిణ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, వ్యవసాయ నిపుణులు, ఐసీఏఆర్ సంస్థలు, ప్రగతిశీల రైతులు, ఇతర భాగస్వాములు ఒకే వేదికపైకి వచ్చి ప్రాంత అవసరాలకు అనుగుణమైన వ్యవసాయ ప్రాధాన్యాలపై చర్చించి, స్థిరమైన, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి సమన్వయాన్ని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు.

# రెండు తలల దూడ జననం

కరీంనగర్, సెప్టెంబర్ 19:బెజ్జంకి మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన రైతు కుసుంబు మోహన్‌రావుకు చెందిన గేదెకు శనివారం రెండు తలల దూడ జన్మించింది.

ఈ ఘటన స్థానికంగా ఆసక్తిని రేకెత్తించడంతో దూడను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జన్యుపరమైన కారణాలతో ఇలాంటి దూడలు జన్మించే అవకాశం ఉంటుందని వెటర్నరీ వైద్య నిపుణులు తెలిపారు.

రెండు తలలతో దూడ జన్మించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి యూఏఈ అధ్యక్షుడి ఫోన్ కాల్

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు గౌరవ షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఫోన్ కాల్ చేశారు.

ప్రధానమంత్రి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపరిచేందుకు ఇంధనం, రక్షణ, సాంకేతికత, పెట్టుబడులు, ఆరోగ్యం వంటి రంగాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి ఇరువురు నేతలు చర్చించారు.

బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ విజయవంతంగా నిర్వహించటం పట్ల ప్రధానమంత్రికి యూఏఈ అధ్యక్షుడు అభినందనలు తెలిపారు. బ్రిక్స్ సమావేశంలో గౌరవ యువరాజు షేక్ ఖాలీద్ పాల్గొనటం పట్ల, భారత దేశ అధ్యక్షతన సార్థకమైన ఫలితాలను సాధించటంలో యూఏఈ సహకారం, భాగస్వామ్యం పట్ల ప్రధానమంత్రి ప్రశంసించారు. పశ్చిమాసియా పరిణావాలపై ఇరువురు నేతలు అభిప్రాయాలను వంచుకున్నారు. ప్రాంతీయ శాంతి, భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించే ప్రయత్నాల్లో నిరంతర సహకారాన్ని, సమన్వయాన్ని కొనసాగించేందుకు నిబద్ధతను తెలియజేశారు.

# కడెం 108 సిబ్బందికి 'లైఫ్ సేవ్' అవార్డు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 19: సమయస్ఫూర్తితో వ్యవహరించి, అత్యవసర పరిస్థితిలో ఉన్న బాధితుడికి తక్షణ వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడిన కడెం 108 అంబులెన్స్ సిబ్బంది ప్రతిష్టాత్మక 'లైఫ్ సేవ్' అవార్డును అందుకున్నారు. ఈ నెల 18 నిర్మల్ జిల్లా కేంద్రంలోని 108 ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్, జిల్లా ఇన్‌ఛార్జ్ లింగాచారితో కలిసి ఈ పురస్కారాన్ని అందజేశారు.

ఇటీవల నమోదైన ఒక అత్యవసర (బెస్ట్ కేసు) కేసులో కడెం అంబులెన్స్‌కు చెందిన ఈఎంటీ మురళీ మోహన్, పైలట్ వసంత్ అత్యంత ప్రతిభను కనబరిచారు. క్లిష్ట సమయంలో బాధితుడికి అవసరమైన ప్రాథమిక వైద్యం అందిస్తూ, సురక్షితంగా ఆస్పత్రికి తరలించి ప్రాణదాతలుగా నిలిచారు. వీరి సేవలను గుర్తించిన యాజమాన్యం 'లైఫ్ సేవ్' అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ.. కడెం 108 సిబ్బంది చూపిన చొరవ, వృత్తి పట్ల వారికున్న అంకితభావం తోటి సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ లింగాచారి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఈఎంటీ మురళీ మోహన్, పైలట్ వసంత్‌ను తోటి సిబ్బంది, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాలతో లబ్ధి

ఆదిలాబాద్, సెప్టెంబర్ 19: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దండేపల్లి మండలంలోని నంబాల, వెల్గనూర్, ద్వారక గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డేగ బాపు, గోపతి రాజయ్య, బెడద సురేష్, పత్తిపాక సంతోష్, బత్తుల శేఖర్, బండే సత్యం, మొరుపుటల సంజీవ్, గడికొప్పుల సురేందర్, ఎంబడి సురేందర్, నలిమెల మహేష్, లక్కాకుల బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో భారత్-నేపాల్ మధ్య వాణిజ్యం, రవాణా, అక్రమ వాణిజ్య నియంత్రణపై సహకారానికి ఏర్పాటైన అంతర-ప్రభుత్వ ఉప-కమిటీ సమావేశం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:భారత్-నేపాల్ మధ్య వాణిజ్యం, రవాణా, అక్రమ వాణిజ్య నియంత్రణపై ఏర్పాటైన అంతర-ప్రభుత్వ ఉప-కమిటీ (ఐజీఎస్‌సీ) సమావేశం సెప్టెంబర్ 16 నుంచి 17, 2026 వరకు న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో జరిగింది.

భారత ప్రతినిధి బృందానికి భారత ప్రభుత్వ వాణిజ్య శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ ఉజ్వల్ కుమార్ ఘోష్ నాయకత్వం వహించగా... నేపాల్ ప్రతినిధి బృందానికి నేపాల్ ప్రభుత్వ పరిశ్రమ, వాణిజ్య, సరఫరా మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ బుద్ధ బహదూర్ గురుంగ్ నాయకత్వం వహించారు. ఈ సమావేశంలో ఇరుదేశాల మంత్రిత్వ శాఖలు, సంబంధిత విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యం, వాణిజ్య సంబంధిత అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు, ద్వైపాక్షిక వాణిజ్యం, రవాణాను సులభతరం చేసేందుకు ఐజీఎస్‌సీ కీలక ద్వైపాక్షిక సంస్థాగత వేదిక.

మార్కెట్ ప్రవేశం, కస్టమ్స్, సులభతర వాణిజ్యం, ప్రమాణాలు, ఆహార భద్రత, మొక్కల పరిరక్షణ చర్యలు, ఔషధాలు, వైద్య పరికరాలు, ఆయుష్ ఉత్పత్తులు, సరిహద్దు మౌలిక వసతులు, రైలు, రహదారి అనుసంధానత, ఇతర వాణిజ్య సంబంధిత అంశాలకు సంబంధించిన ఎన్నో సమస్యలను ఇరుదేశాలు ఈ సమావేశంలో సమీక్షించాయి.

భారత్, నేపాల్ ఉత్పత్తులకు మరింత మెరుగైన మార్కెట్ ప్రవేశాన్ని కల్పించే చర్యలపై ఇరువర్గాలు చర్చించాయి. వ్యవసాయ ఉత్పత్తులు, పాడి పరిశ్రమ, ఆహార పదార్థాలు, ఔషధాలు, వైద్య పరికరాలు, ఆయుష్ ఉత్పత్తులతో పాటు ప్రమాణాలు, మొక్కల సంరక్షణ ఆవశ్యకత గురించి చర్చించారు.

కస్టమ్స్ సహకారాన్ని, వాణిజ్య సులభతరాన్ని బలోపేతం చేయటంపై రెండు దేశాలు చర్చించాయి. ఇందులో భాగంగా ముందస్తుగా సమాచారాన్ని పంచుకోవటం, అసలైన ధ్రువీకరణ పత్రాల ఎలక్ట్రానిక్ ధ్రువీకరణ, కస్టమ్స్ ఆటోమేషన్, డిజిటలైజేషన్ వంటి అంశాలున్నాయి. చట్టబద్ధమైన వాణిజ్యాన్ని సులభతరం చేయుటంతో పాటు వర్తించే నిబంధనలను పాటించేలా, ప్రాధాన్యతా వాణిజ్య ఏర్పాట్ల దుర్వినియోగాన్ని అరికట్టేలా చర్యలను బలోపేతం చేయటంపై ఈ చర్చలు దృష్టి సారించాయి.

ఈ చర్చల్లో రవాణా, అనుసంధానం కీలక భాగంగా నిలిచాయి. ఇరుదేశాలు రైలు, రోడ్డు అనుసంధానం, సరకు రవాణా, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, ల్యాండ్-పోర్ట్ మౌలిక వసతులను సమీక్షించాయి. ద్వైపాక్షిక, రవాణా వాణిజ్యానికి సంబంధించి ప్రస్తుతమున్న మౌలిక సదుపాయాల వినియోగాన్ని మెరుగుపరచటం, ఎదురవుతున్న ఆపరేషనల్ అడ్డంకులను తొలగించటంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి.

ప్రమాణాలు, ఆహార భద్రత, మొక్కల నియంత్రణ, నాణ్యతా ప్రమాణాల అంచనా, సంస్థాగత సహకారం, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలతో సహా కొనసాగుతున్న పరస్పర సహకారాన్ని ఇరుపక్షాలు స్వాగతించాయి.

చట్టబద్ధమైన సరిహద్దు వాణిజ్యాన్ని సులభతరం చేసేందుకు అక్రమ వాణిజ్యం, వాణిజ్య మోసాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత ఏజెన్సీల మధ్య నిరంతర సహకారం ఎంతైనా ముఖ్యమని ఇరుదేశాలు స్పష్టం చేశాయి.

ఈ సమావేశం అత్యంత స్నేహపూర్వకంగా, సానుకూల వాతావరణంలో జరిగింది. మరింత సాంకేతిక పరిశీలన అవసరమైన అంశాలపై నిర్ణీత కాలపరిమితిలో తదుపరి చర్యలు తీసుకునేందుకు, ఇప్పటికే ఉన్న సంస్థాగత విధానాల ద్వారా నిరంతరం సంప్రదింపులు కొనసాగించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి.

భారత్, నేపాల్ మధ్య బలమైన చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలున్నాయి. నేపాల్‌కు భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా, ముఖ్యమైన పెట్టుబడిదారుగా కొనసాగుతోంది. ఐజీఎస్‌సీలో జరిగిన చర్చలు ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం, రవాణా అనుసంధానం, ఆర్థిక సహకారాన్ని మరింత బలపరుస్తాయని భావిస్తున్నారు.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పురానా ఖిలాలో 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించిన సాంస్కృతిక మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 2026 సెప్టెంబర్ 17న న్యూఢిల్లీ లోని పురానా ఖిలాలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించింది. 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ "భారత్ మాతా కీ జై" నినాదాల మధ్య 'ఆశీర్వాద్ కా దియా' (ఆశీర్వాద దీపం) వెలిగించి ప్రారంభించారు.

కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ.. 'ఆశీర్వాద్ కా దియా' కేవలం ఒక దీపం మాత్రమే కాదని, ప్రజల ఆశీర్వాద శక్తికి సేవకు, కృతజ్ఞతా భావానికి, వికసిత్ భారత్ లక్ష్య సాధన సంకల్పానికి ప్రతీక అని అన్నారు. భారతీయ సంస్కృతిలో దీపం తనను తాను దహించుకుంటూ ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడం, చీకటిని తొలగించడం, ప్రజా సంక్షేమానికి మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ దీపం దేశ సేవ పట్ల సమష్టి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి.. ఆయన ప్రజా జీవితం జాతీయ ప్రయోజనం, ప్రజాసేవకు అంకితమైందని అన్నారు. బాల్యం నుంచి నేటి వరకు ఏ బాధ్యతలో పనిచేసే అవకాశం లభించినా, దేశమే ప్రథమం అనే భావనతో పూర్తి అంకితభావంతో, సేవా స్ఫూర్తితో పనిచేశారని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం నుంచి ప్రధానమంత్రిగా దేశానికి నాయకత్వం వహించే వరకు జాతీయ సేవ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆయన నిబద్ధత ఏమాత్రం తగ్గకుండా, స్థిరంగా కొనసాగిందని తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో కలిసి పనిచేసిన తన అనుభవాన్ని శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ పంచుకున్నారు. ప్రధానమంత్రితో కలిసి పనిచేసే అవకాశం లభించడం తన ప్రజా జీవితంలో ఎంతో గౌరవప్రదమైన అనుభవమని అన్నారు. శ్రీ మోదీని తాను కేవలం ప్రధానమంత్రిగా మాత్రమే కాకుండా, అంకితభావంతో పనిచేసే కార్యకర్తగా, అన్వేషకుడిగా, తపస్విగా, సంస్థాగత కార్యకర్తగా చూశానని తెలిపారు. తన ప్రవర్తన, పని విధానం, మార్గదర్శకత్వం ద్వారా ప్రధానమంత్రి ప్రతి స్థాయిలోని ప్రజలకు స్ఫూర్తినిస్తారని, ప్రభుత్వ పదవిని ప్రతిష్టగా కాకుండా బాధ్యత, సేవకు ఒక సాధనంగా భావిస్తారని చెప్పారు.

ప్రధానమంత్రి పని విధానం ఫలితాల ఆధారిత పాలనపై కేంద్రీకృతమై ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. పథకాలను కేవలం ప్రక్రియలు లేదా గణాంకాల ఆధారంగా కాకుండా, అవి సమాజంపై చూపుతున్న వాస్తవ ప్రభావం, చివరి వ్యక్తి వరకు చేరుతున్న మార్పు ఆధారంగా సమీక్షిస్తారని అన్నారు. ఒక ఫైల్‌ను ముందుకు పంపడం మాత్రమే పని పూర్తయినట్లు కాదని, దాని ద్వారా ప్రజా సంక్షేమానికి కలిగే ఫలితాలే సుపరిపాలనకు అసలైన కొలమానమని ప్రధానమంత్రి స్పష్టంగా భావిస్తారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

2014 తర్వాత భారత్ అభివృద్ధి, సుపరిపాలన దిశగా ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించిందని శ్రీ షెకావత్ అన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో దేశంలో ప్రజల విశ్వాసం బలోపేతమైందని, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరిగిందని తెలిపారు. "వారసత్వం, అభివృద్ధి" పరస్పర విరుద్ధమైనవి కావని, ఒకదానికొకటి పరిపూరకమైనవని ప్రధానమంత్రి విశ్వసిస్తారని ఆయన చెప్పారు. వికసిత్ భారత్ నిర్మాణంలో ఈ రెండింటికీ సమానమైన పాత్ర ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మార్గదర్శకత్వంలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ "వికాస్ భీ, విరాసత్ భీ" అనే సంకల్పంతో పనిచేస్తోందని అన్నారు. దేశంలోని శాస్త్రీయ, జానపద, సాంస్కృతిక సంప్రదాయాలు మన నాగరికతా చైతన్యానికి అమూల్యమైన వారసత్వ సంపద అని, వాటిని పరిరక్షించడం, ప్రోత్సహించడం, కొత్త తరానికి విస్తృతంగా పరిచయం చేయడం మంత్రిత్వ శాఖ ప్రధాన ప్రాధాన్యత అని తెలిపారు. తన వారసత్వ స్ఫూర్తితో ముందుకు సాగే సమాజమే వికసిత్ భారత్ లక్ష్యం వైపు విశ్వాసంతో, గర్వంతో పయనించగలదని ఆయన అన్నారు.

తన ప్రసంగంలో శ్రీ షెకావత్ ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సును ప్రస్తావించారు. ప్రపంచ స్థాయిలో భారత్ పోషిస్తున్న పాత్ర, భారత్‌పై ప్రపంచ దేశాల్లో పెరుగుతున్న విశ్వాసం దేశం చూపుతున్న నిర్ణయాత్మక నాయకత్వాన్ని, జాతీయ ప్రయోజనాల పట్ల దాని నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. క్లిష్ట పరిస్థితులు, సవాళ్లు ఎదురైనప్పటికీ జాతీయ ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రపంచ సమాజం ముందు భారత్ తన సమర్థవంతమైన పాత్రను స్థాపించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ, కథక్ కేంద్రం, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, లలిత కళా అకాడమీ, జోనల్ సాంస్కృతిక కేంద్రాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు భారతీయ శాస్త్రీయ, సాంస్కృతిక సంప్రదాయాల ఆధారంగా ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమం అనంతరం కేంద్ర మంత్రి కళాకారులు, విద్యార్థులు, జాతీయ సాంస్కృతిక నిధి, 'అడాప్ట్ ఎ హెరిటేజ్' కార్యక్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములతో సమావేశమై, భారతీయ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, ప్రోత్సాహంలో వారు అందిస్తున్న సేవలను అభినందించారు.

'ఆశీర్వాద్ కా దియా'ను సామూహికంగా వెలిగించడంతో కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా అమృత్ కాలంలో సేవ, సంస్కృతి, దేశ నిర్మాణం, వికసిత్ భారత్ 2047 సాధన కోసం తమ సంకల్పాన్ని మరోసారి చాటిచెప్పారు.

# టోకు వినియోగదారులు15 రోజుల అవసరాలకు సరిపడే చక్కెరను మాత్రమే నిల్వ చేయాలన్న పరిమితిని 30 రోజులకు సడలించిన ప్రభుత్వం

నల్గొండ, సెప్టెంబర్ 19: టోకు వినియోగదారులు15 రోజులకు సరిపడే చక్కెర మాత్రమే నిల్వ చేసుకోవాలన్న నిబంధనను ప్రభుత్వం సడలించింది. ఈ పరిమితిని 30 రోజులకు పెంచింది. అయితే 15 రోజులకు మించిన అదనపు నిల్వలను కేవలం అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్ (ఏఏఎస్), టారిఫ్ రేట్ కోటా (టీఆర్‌క్యూ) ద్వారా దిగుమతి చేసుకున్న చక్కెర నుంచి మాత్రమే సేకరించాలనే షరతును విధించింది. బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేసే వారికి నిల్వ పరిమితిలో ఎలాంటి మార్పు లేదు. అది 15 రోజుల వినియోగానికి మాత్రమే పరిమితమవుతుంది. బల్క్ వినియోగదారులు తమ దగ్గర ఉన్న చక్కెర నిల్వలను ప్రతి శుక్రవారం ప్రకటించే వ్యవస్థను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ వివరాలను ఆహారం, ప్రజా పంపిణీ విభాగం ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేయాలని ఆదేశించింది.

స్థిరమైన, క్రమబద్ధమైన చక్కెర మార్కెట్‌ను నిర్వహించడంలో భాగంగా చక్కెర టోకు వినియోగదారులతో ప్రభుత్వం సంప్రదింపులు నిర్వహించింది. వారి సూచనలను పరిగణనలోకి తీసుకుంది.

ప్రస్తుతం నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ చక్కెరను ఉత్పత్తి లేదా వినియోగం కోసం ముడిసరకుగా ఉపయోగించే టోకు వినియోగదారులు తమ 15 రోజుల అవసరాలకు మించి నిల్వ చేయడానికి అనుమతి లేదు. రానున్న పండగ సీజన్ నేపథ్యంలో ఈ పరిమితిని సడలించాలని టోకు వినియోగదారులు ప్రభుత్వాన్ని కోరారు. అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్, టారిఫ్ రేట్ కోటా కింద చక్కెరను దిగుమతి చేసుకున్నవారి దగ్గర నుంచి నేరుగా కొనుగోళ్లు చేసేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశీయ సరఫరాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా, పారిశ్రామిక అవసరాలకు నిరంతరాయంగా చక్కెర అందుబాటులో ఉండేలా వారు ఈ సూచన చేశారు.

టోకు వినియోగదారుల ప్రయోజనాలకు, దేశీయ చక్కెర మార్కెట్లో స్థిరత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరానికి మధ్య సమతౌల్యాన్ని సాధించడమే ఈ చర్య లక్ష్యం. ఇది రాబోయే పండగ సీజన్ సందర్భంగా నిజమైన పారిశ్రామిక వినియోగదారులకు విస్తృతమైన పరిపాలనా సౌలభ్యాన్ని అందిస్తుంది. అదే సమయంలో దేశీయ నిల్వలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా దిగుమతి చేసుకున్న చక్కెర నుంచి అదనపు నిల్వలను సమకూర్చుకొనే వీలు కల్పిస్తుంది.

చక్కెర రీటైల్ ధరలు గరిష్ఠ స్థాయి నుంచి సుమారు 10 శాతం (ఆగస్టులో రూ.65 నుంచి రూ.58.50కు) తగ్గాయి. మిల్లు ధరల్లోనూ సుమారుగా 25 శాతం తగ్గుదల ఉంది. మిల్లు ధరల తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనం సరఫరా వ్యవస్థ ద్వారా వినియోగదారులకు పూర్తిగా చేరడం లేదన్న విషయాన్ని రీటైల్ ధరల తగ్గుదలలో మందగమనం సూచిస్తోందని ప్రభుత్వం గమనించింది.

ఐఎన్ఎంఏ, చక్కెర కర్మాగారాల జాతీయ సహకార సంఘం, చక్కెర వాణిజ్య రంగం ప్రతినిధులతో నిర్వహించిన సంయుక్త సమావేశంలో మిల్లు ధరల్లో తగ్గుదల రీటైల్ ధరల్లో ప్రతిబింబించడం లేదని ఆహారం, ప్రజా పంపిణీ విభాగ కార్యదర్శి అన్నారు.

చక్కెర మిల్లు ధరలు గణనీయంగా తగ్గడం వల్ల కలిగే ప్రయోజనాన్ని వెంటనే వినియోగదారులకు అందించాలని చక్కెర వ్యాపారులు, టోకు వ్యాపారులు, చిల్లర వ్యాపారులకు ప్రభుత్వం ఈ రోజు స్పష్టంగా చెప్పింది. మిల్లు స్థాయిల్లో ఇప్పటికే తగ్గిన ధరలకు అనుగుణంగానే రీటైల్ మార్కెట్లలోనూ ధరల తగ్గింపు ఉండాలని స్పష్టం చేసింది. రాబోయే పండగ సీజన్లో చక్కెర, చక్కెర ఆధారిత ఉత్పత్తులు సామాన్య వినియోగదారులకు అందుబాటు ధరల్లో లభించేలా చక్కెర సరఫరా వ్యవస్థ మొత్తం సమష్టి కృషి చేయాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.

భారతదేశ చక్కెర విధానానికి రైతు, వినియోగదారుడే ప్రధాన ఆధారాలని కార్యదర్శి చెప్పారు. చెరకు రైతుల ప్రయోజనాలను వినియోగదారులకు అందించే స్థిరమైన, సహేతుకమైన ధరలతో సమతౌల్యం చేయడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. కొత్త చక్కెర సీజన్ ప్రారంభమయ్యే 2026 అక్టోబర్ 1 నుంచి చెరకు రైతులకు పెంచిన న్యాయబద్ధమైన, గిట్టుబాటు ధర (ఎఫ్ఆర్‌పీ) క్వింటాల్‌కు ?365 చొప్పున అందుతుంది. చక్కెర రంగం సమతౌల్యాన్ని కాపాడుతూనే, చెరకు రైతులకు లాభదాయకమైన రాబడిని అందించడానికి ప్రభుత్వం ప్రతి ఏటా ఎఫ్ఆర్‌పీని పెంచుతూ వస్తోంది.

దేశీయ మార్కెట్లో చక్కెర లభ్యతను, ధరలను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. వినియోగదారులకు, ఆహార శుద్ధి పరిశ్రమలకు, కర్మాగారాల అవసరాలకు తగినంత చక్కెర అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలను తీసుకుంటుంది.

# ప్రజాభవన్‌లో ఘనంగా పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

## -కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క



ములుగు, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డాక్టర్ సీతక్క అశోక్ తో కలిసి కేక్ కట్ చేసి, ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అశోక్ కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ, ములుగు జిల్లాలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

కష్టకాలంలోనూ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తూ, ఎన్నికల సమయంలో కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేయడం అశోక్ ప్రత్యేకత అని సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆయన ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

పైడాకుల అశోక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు, పార్టీకి మరింత సేవ చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అశోక్‌కి శుభాకాంక్షలు తెలిపారు

# జల్సాల ఖర్చుల కోసం బ్యాటరీల చోరీ

## 24 గంటల్లో ఇద్దరు నిందితుల గుర్తింపు.. ఒకరి అరెస్టు, మరొకరు పరారు




ఆదిలాబాద్, సెప్టెంబర్ 19:జల్సాల ఖర్చుల కోసం ఇంటి ముందు నిలిపి ఉంచిన రెండు ఆటోల బ్యాటరీలను ఇద్దరు వ్యక్తులు అర్ధరాత్రి చోరీ చేసిన ఘటన జన్నారం మండలం పొనకల్‌లో చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. పొనకల్ గ్రామంలోని వినాయకనగర్ తహసీల్దార్ రోడ్డులో అద్దెకు ఉంటున్న ఎల్కపల్లి నరేశ్‌కు చెందిన ఏపీ 1ఎక్స్ 7765 ఆటో, సంబరాజుల రాజశేఖర్‌కు చెందిన టీఎస్ 19టీ 4353 ఆటో బ్యాటరీలను ఈ నెల 16న రాత్రి దొంగలు అపహరించారు. వాటి విలువ సుమారు రూ.10 వేలుగా పోలీసులు తెలిపారు.

నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై గుర్రం ఉదయ్‌కిరణ్ దర్యాప్తు చేపట్టారు. 24 గంటల్లోనే ధర్మారానికి చెందిన గడ్డి చంద్రశేఖర్, పొనకల్ వినాయకనగర్‌కు చెందిన ఎరుకల అరుణ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

చోరీ చేసిన రెండు బ్యాటరీలను విక్రయిస్తుండగా చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి లక్షెట్టిపేట కోర్టుకు తరలించారు. మరో నిందితుడు అరుణ్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. రెండు బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్సై, పోలీసులను పలువురు అభినందించారు.

# కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డులో భారత నౌకాదళం కోసం నెక్స్ట్ జనరేషన్ మిస్సైల్ వెసెల్ (ఎన్‌జీఎంవీ) రెండో నౌక నిర్మాణం ప్రారంభం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్)లో 2026 సెప్టెంబర్ 17న నెక్స్ట్ జనరేషన్ మిస్సైల్ వెసెల్ (ఎన్‌జీఎంవీ) ప్రాజెక్టు రెండో నౌక నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. యుద్ధ నౌకల తయారీ, సేకరణ అసిస్టెంట్ కంట్రోలర్ అయిన రియర్ అడ్మిరల్ కపిల్ మెహతా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భారత నౌకాదళం, సీఎస్ఎల్‌కు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

2023 మార్చిలో ఎన్‌జీఎంవీల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందం కుదిరింది. అత్యాధునిక ఆయుధాలను, సెన్సార్లను ఎన్‌జీఎంవీల్లో ఏర్పాటు చేస్తారు. ఇవి భవిష్యత్తుకు, పోరాటానికి సిద్ధంగా ఉన్న బలగాలుగా భారతీయ నౌకాదళం సామర్థ్యాలను గణనీయంగా మెరుగుపరుస్తాయి. క్లిష్టమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో పనిచేయగల బలమైన, ఆధునికమైన నౌకాదళాన్ని సిద్ధం చేయడంలో భారత్ నిబద్ధతను ఈ నౌకల నిర్మాణం బలోపేతం చేస్తుంది.కీలకమైన పరికరాలన్నింటినీ దేశీయంగా అభివృద్ధి చేసి, తయారు చేశారు. ఇది దేశ సామర్థ్యాన్ని తెలియజేస్తూ... ఆత్మనిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్ లాంటి భారత ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు అనుగుణంగా ఉంది.

# మోసపూరితంగా రూ. 25.22 కోట్లకు పైగా విలువైన ఐటీసీని పొందిన సంస్థను గుర్తించి భగ్నం చేసిన ఢిల్లీ సౌత్ సీజీఎస్టీ అధికారులు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయింలపై కొనసాగుతున్న తనిఖీల్లో భాగంగా కేంద్ర వస్తు, సేవల పన్ను (సీజీఎస్టీ) ఢిల్లీ సౌత్ కమిషనరేట్‌కు చెందిన పన్ను ఎగవేత నిరోధక విభాగం అధికారులు ఒక పెద్ద మోసాన్ని బయటపెట్టారు. దాదాపు రూ. 140.14 కోట్ల బోగస్ ఇన్‌వాయిస్‌ల ద్వారా దాదాపు రూ. 25.22 కోట్లకు పైగా అర్హత లేని ఐటీసీని అక్రమంగా పొందడం, వినియోగించడం, ఇతరులకు బదిలీ చేసిన కేసులో.. ఇనుము, ఉక్కు వస్తువుల వ్యాపారంలో ఉన్న ఒక సంస్థ ప్రొప్రైటర్‌ను అధికారులు అరెస్ట్ చేశారు.

ఉనికిలో లేని, ప్రస్తుతం పనిచేయని, నిలిచిపోయిన లేదా రద్దయిన పలు సంస్థలు జారీ చేసిన ఇన్వాయిస్‌ల ఆధారంగా.. అర్హత లేని ఐటీసీని ఆ సంస్థ పొందినట్టు విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా కొందరు సరఫరాదారులు తాము నమోదు చేసుకున్న వ్యాపార ప్రాంగణాల్లో ఎలాంటి వాస్తవిక వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం లేదని కూడా క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది.

సరుకులు అందకుండానే ఐటీసీని వినియోగించుకున్నారని, అలాగే సరుకుల సరఫరా చేయకుండానే జారీ చేసిన ఇన్‌వాయిస్‌ల ద్వారా ఆ మొత్తాన్ని ఇతరులకు బదిలీ తదుపరి విచారణలో రుజువైంది.

విచారణలో లభించిన ఆధారాలు, సీజీఎస్టీ చట్టం - 2017 లోని సెక్షన్ 70 కింద నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా.. 2026 సెప్టెంబర్ 17న సెక్షన్ 69 కింద నిందితుడిని అరెస్టు చేశారు. అనంతరం పటియాలా హౌస్ కోర్టు ఎదుట హాజరుపరచగా.. న్యాయస్థానం అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

# గిరిజన యువతకు న్యాయం చేయాలి..

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన మాలోత్ రాందాస్ నాయక్, గిరిజన ఎమ్మెల్యేలు

ఖమ్మం, సెప్టెంబర్ 19:గిరిజన ప్రాంతాల్లోని స్థానిక యువతకు పోలీస్ ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించేందుకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమం, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఇతర గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా మాలోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న స్థానిక యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల భౌగోళిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని స్థానిక యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోలీస్ ఉద్యోగం స్థానిక యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు, పోలీస్ శాఖలో స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న యువతకు అవకాశం కల్పించినట్లు అవుతుందని తెలిపారు. స్థానిక యువత పోలీస్ వ్యవస్థలో భాగస్వాములైతే ప్రజలకు, పోలీసులకు మధ్య మరింత విశ్వాసపూర్వక సంబంధాలు ఏర్పడతాయని అన్నారు.

గతంలో గిరిజన ప్రాంతాల యువత ఎదుర్కొన్న ఉద్యోగ అవకాశాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని 75 శాతం రిజర్వేషన్



అమలుకు అవసరమైన రాజ్యాంగ, చట్టపరమైన అంశాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

గిరిజన యువతకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకుంటారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, యువతకు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు.

# భారతదేశ తదుపరి వృద్ధి రంగంగా ఆవిర్భవిస్తున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ? యువ భారతీయులకు నూతన అవకాశాల కల్పన: డాక్టర్ ఎల్. మురుగన్

"చట్టం, విధానాలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ" అంశంపై ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో జరిగిన జిందాల్ పాలసీ కాంక్లేవ్ ప్రారంభోత్సవానికి సమాచార, ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు.

యువ భాగస్వామ్యులను ఉద్దేశించి డాక్టర్ మురుగన్ మాట్లాడుతూ... ఆలోచనలు, ఊహాశక్తి, సంస్కృతి, ఆవిష్కరణలు, మేధో సంపత్తి ఆధారంగా భారత సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. చలన చిత్రాలు, సంగీతం, గేమింగ్, యానిమేషన్, డిజైన్, ప్రచురణ, ప్రకటనలు, డిజిటల్ కంటెంట్ వంటి రంగాలు ఉపాధి, వ్యవస్థాపకతకు నూతన అవకాశాలను కల్పిస్తున్నాయని చెప్పారు.డాక్టర్ మురుగన్ వెల్లడించిన వివరాల ప్రకారం సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ... ప్రపంచ జీడీపీకి 3.1 శాతం, ప్రపంచ ఉపాధిలో 6.2 శాతం దోహదపడుతోంది. ఇప్పటికే దాదాపు 57 లక్షల మంది భారతీయులు సాంస్కృతిక, సృజనాత్మక రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. భారతదేశ మీడియా, వినోద రంగం విలువ రూ. 2.5 లక్షల కోట్లుగా ఉంది.

యువ భారతీయులకున్న అవకాశాలను తెలియజేస్తూ... ఒక్క ఏవీజీసీ రంగానికే 2030 నాటికి దాదాపు 20 లక్షల మంది నైపుణ్యం గల నిపుణులు అవసరమవుతారని ఆయన తెలిపారు. యువతను ఈ సరికొత్త అవకాశాలకు సిద్ధం చేసేందుకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ ఏర్పాటుకు, 15,000 పాఠశాలలు, 500 కళాశాలల్లో ఏవీజీసీ క్రియేటర్ ల్యాబ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం మద్దతిచ్చింది.సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి తగిన చట్టపరమైన, విధానపరమైన ప్రణాళిక మద్దతు ఉండాలని డాక్టర్ మురుగన్ స్పష్టం చేశారు. ఇందులో కాపీరైట్ రక్షణ, సృష్టికర్తలకు సరైన పారితోషికం, బాధ్యతాయుతమైన కృత్రిమ మేధ వినియోగం వంటివి భాగంగా ఉండాలని చెప్పారు. గౌరవంగా, ఆలోచనతో, ఆధారాలతో ప్రస్తుత వ్యవస్థలను, సంప్రదాయాలను ప్రశ్నించాలని యువతకు పిలుపునిచ్చారు.

# దృఢత్వం, శక్తి, నూతన ఆవిష్కరణలు, సమ్మిళిత అభివృద్ధితో '2047కల్లా వికసిత్ భారత్' లక్ష్య సాధనకు పురోగమిస్తున్న భారత్: రక్షణ మంత్రి

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:'వికసిత్ భారత్ లక్ష్యాన్ని 2047కల్లా సాధించడానికి' పౌరుల్లో సవాళ్లను ఎదుర్కొనే స్థితి, దృఢసంకల్పం, కరుణ, నూతన ఆవిష్కరణలు, శక్తి, సమ్మిళిత అభివృద్ధి, జాతీయ గుర్తింపు తాలూకు ప్రబల భావనను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తూ దేశానికి సేవలు అందిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ రోజు కేరళంలోని కోచిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సాహసం, ప్రజాసంక్షేమం, భద్రత, సేవాభావం, లక్ష్యాలను సాధించాలన్న దృఢసంకల్పం, కరుణ, భావితరాల వారికి ప్రేరణనివ్వడం, జాతీయ సామర్థ్యాలను బలోపేతం చేయడం, సమ్మిళిత వృద్ధి, ప్రపంచానికి నాయకత్వాన్ని అందించడం వంటి శతాబ్దాల నాటి విలువల నుంచి భారత్ స్ఫూర్తిని పొంది, అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకు పోతోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

భారత్ 2014కు పూర్వం.. అవినీతి, దుష్పరిపాలన వంటి ముఖ్య సవాళ్లను ఎదుర్కొందని, ఈ సవాళ్లు ప్రజల మనోబలాన్ని బలహీనపరిచాయని రక్షణ మంత్రి అన్నారు. ప్రతికూలతలకు ఆత్మవిశ్వాసంతో ఎదురొడ్డి నిలవడంతో పాటు, ఆ ప్రతికూలతలను అవకాశాలుగా మార్చుకునే సామర్థ్యంతో గత 12 సంవత్సరాల్లో దేశ ప్రగతి సాధ్యపడిందని ఆయన అన్నారు. "గత పన్నెండు సంవత్సరాలలో, ప్రపంచంలో కోవిడ్-19 వంటి మహమ్మారి ఎదురైంది. అనేక యుద్ధాలు వచ్చాయి. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అంతర్జాతీయ సవాళ్లు ఎదురైనా, మనం స్వావలంబన కలిగిన, అభివృద్ధి చెందిన దేశంగా మారే మార్గంలో పురోగమిస్తున్నాం" అని ఆయన అన్నారు.

దుష్ట శక్తుల నుంచి పౌరులను కాపాడి, వారికి భద్రతను కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు ముప్పు కలగజేయాలనుకున్న వారిని అంతం చేయడానికి సరిహద్దును దాటేందుకు కూడా భారత్ సిద్ధంగా ఉంటుందనడానికి ఆపరేషన్ సిందూర్ ఒక నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. నక్సలిజాన్ని కూడా పరిసమాప్తం చేశామని ఆయన అన్నారు.

దేశీయ శక్తియుక్తులను నిరంతరాయంగా ప్రోత్సహిస్తూ ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రక్షణ మంత్రి అన్నారు. దేశవాళీ రక్షణ రంగ ఉత్పత్తుల విలువ 2014లో రూ.40,000 కోట్ల స్థాయిలో ఉంటే, ప్రస్తుతం అది దాదాపు రూ.1.80 లక్షల కోట్లకు చేరుకొందని ఆయన తెలిపారు. రక్షణ రంగ ఎగుమతులు సుమారు రూ.600 కోట్ల నుంచి రమారమి రూ.40,000 కోట్లకు పెరిగాయన్నారు. భారత రక్షణ ఉత్పాదనలు ఇంచుమించు 100 దేశాలకు చేరుకుంటున్నాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

దేశ లక్ష్యాలను సాహసం, దృఢసంకల్పంతో సాధించుకోవడానికి అలుపెరుగని ప్రయత్నాలు చేయాలన్నదే పౌరుల సంకల్పంగా ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెబుతూ, దేశానికి అన్నింటి కన్న పెద్ద శక్తిగా యువత నిలుస్తోందన్నారు. "మన యువతీయువకులు అంకుర సంస్థలను ఏర్పాటు చేస్తున్నారు. యూనికార్న్‌లను తీర్చిదిద్దుతున్నారు. హైడ్రోజన్ రాకెట్లను రూపొందిస్తున్నారు. రాకెట్లను, కృత్రిమ ఉపగ్రహాలను తయారు చేస్తున్నారు. వారు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఏ ప్రయత్నాన్నీ వదలివేయడం లేదు" అని రక్షణ మంత్రి అన్నారు.

కరుణ భావన నుంచి ప్రభుత్వం స్ఫూర్తిని పొంది, ప్రజల జీవనాన్ని మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందని రక్షణ మంత్రి అన్నారు. గత పది, పన్నెండు సంవత్సరాల్లో 250 మిలియన్ కన్నా ఎక్కువ మంది ప్రజలను పేదరికం గుప్పిట్లో నుంచి బయటకు తీసుకు వచ్చిందన్నారు. భారత్ ప్రజాస్వామ్య సాఫల్యమో, లేదా భారత్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం కావడమో.. ఏ రకంగా అయినా సరే భారత్ ఇవాళ ప్రపంచ దేశాలకు స్ఫూర్తినిస్తోందని కూడా ఆయన అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన వాస్తవ కాల చెల్లింపుల వ్యవస్థ 'యూపీఐ'ని గురించి ఆయన ప్రస్తావించారు. దీనిని 11 కన్నా ఎక్కువ దేశాలు స్వీకరించాయన్నారు. అభివృద్ధి ఫలాలను మరింత మంది చెంతకు చేర్చిన 'పీఎమ్ శ్రీ', 'ఆయుష్మాన్ భారత్', 'లఖ్‌పతి దీదీ', 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన', 'జల్ జీవన్ మిషన్', 'ఉజ్వల యోజన'లను గురించి మంత్రి ప్రస్తావించారు.

ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా భారత్ నిలిచిందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వర్ణించారు. వాతావరణ మార్పుతో పోరాడటానికి అనేక లక్ష్యాలను భారత్ నిర్దేశించుకొని, వాటిని అనుకున్న కాలాని కన్న ఎంతో ముందుగా సాధించిందని, కోవిడ్-19 వేళ దేశ ప్రజలకు టీకామందులను ఇప్పించిందని, 100 దేశాలకు 300 మిలియన్ టీకాలను పంపించిందని తెలిపారు. ప్రపంచం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకొంటున్న తరుణంలో, భారత్ ఒక నాగరికతా నేతగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. 'అంతర్జాతీయ సౌర కూటమి' (ఐఎస్ఏ), 'గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయెన్స్' వంటి కార్యక్రమాలతో ప్రపంచానికి నాయకత్వాన్ని భారత్ అందిస్తోందని ఆయన అన్నారు.

ఒక్క ఆర్థిక అభివృద్ధికే భారత్ అభివృద్ధి ప్రస్థానం పరిమితం కాదని, జాతీయ ఆత్మవిశ్వాసాన్ని బలపరుచుకొని వలసవాద మనస్తత్వం నుంచి బయటపడి ముందుకు దూసుకుపోవడం కూడా అందులో ఓ భాగమని రక్షణ మంత్రి అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సారథ్యంలో, భారత్ సాంస్కృతికంగా, నాగరికతపరంగా పునర్జాగృతికి సాక్షిగా నిలుస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సాంస్కృతిక, నాగరికతా సంబంధ వారసత్వాలకు గల ప్రాధాన్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ, దేశంలో ఆధునికీకరణ యాత్ర దాని సాంస్కృతిక సంప్రదాయాల్ని గౌరవించుకోవడంతో సమానంగా సాగాలన్నారు. ""సర్వ ధర్మ సమభావం" లేదా అన్ని ధర్మాలకు సమాన గౌరవం ఎల్లప్పటికీ మన నాగరికతా ఆలోచనాస్రవంతిలో కీలకంగా నిలిచింది. ఏమైనా, పాశ్చాత్య మతాతీతవాదం కారణంగా మన ధర్మాన్ని మతతత్త్వవాదంగా, సంప్రదాయవాలను వెనుకబాటుతనంగా, నమ్మకాన్ని ఛాందసత్వంగా, ధర్మాన్ని మూఢవిశ్వాసంగా చిత్రించే ప్రయత్నాలు జరిగాయి" అని ఆయన అన్నారు.

భారతదేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వాలను మరింత ఎక్కువగా యువతరం తెలుసుకొనేటట్లు చూడడం ప్రధానమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. యువతలో ఎక్కువ చైతన్యం వస్తే జాతీయ చేతన బలపడుతుందని, ప్రపంచంలో భారత్‌కున్న స్థానం పట్ల ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుందని ఆయన అన్నారు. భారత్ ఆర్థిక, సామాజిక, సాంకేతిక మార్పులలో తోడ్పాటును అందించాల్సిందిగా యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఆత్మవిశ్వాసం తొణికిసలాడే, సమర్థమైన, సామాజికంగా సమ్మిళితమైన భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలుగుతుందని, ప్రపంచ భవితకు రూపురేఖలను సంతరించడంలో ప్రధాన భూమికను పోషించగలుగుతుందని ఆయన అన్నారు.

నేటి కాలంలో సమాచార ప్రసార సాధనాల కీలక భూమికను గురించి రక్షణ మంత్రి ప్రస్తావిస్తూ, పత్రికారచనను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా వర్ణించడం సరైందేనని, జవాబుదారుతనానికి పూచీపడే బలమైన సాధనాల్లో స్వతంత్రమైన, నిష్పాక్షికమైన పత్రికా రంగం ఒకటన్నారు. "వార్తల్ని అందించడమొక్కటే సమాచార ప్రసార సాధనాల పాత్ర కాదు. క్లిష్టమైన ప్రశ్నలను అడగడం, నిజాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం, అధికారంలో ఉన్న వారిని జవాబుదారీతనం కలిగినవారుగా నిలపడం కూడా మీడియా వంతే" అని ఆయన అన్నారు.

# ముకుత్‌బన్ (ఆదిలాబాద్), గడ్చందూర్ మధ్య రూ. 493 కోట్లతో 38.21 కి.మీ.ల కొత్త రైల్వే లైనుకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:ప్రాంతీయ రైల్వే అనుసంధానాన్ని బలోపేతం చేసే, ప్రయాణికులను, సరకులను వేగంగా, సమర్థంగా రవాణా చేసే దిశగా రూ.493 కోట్ల వ్యయంతో కొత్త రైల్వే మార్గం నిర్మాణానికి భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ముకుత్‌బన్ (ఆదిలాబాద్), గడ్చందూర్ మధ్య రూ.38.21 కి.మీ.ల మేర ఈ నూతన రైలు మార్గాన్ని నిర్మించనున్నారు.

యవత్మల్ జిల్లాలోని ముకుత్‌బన్, చంద్రాపూర్ జిల్లాలోని గడ్చందూర్ ముఖ్యమైన పారిశ్రామిక, మైనింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడ అనేక సిమెంట్ ప్లాంట్లు, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌కు చెందిన బొగ్గు గనులు, సున్నపురాయి గనులు ఉన్నాయి. ఈ పారిశ్రామిక క్లస్టర్లకు రవాణా అనుసంధానాన్ని కొత్త రైల్వే లైను బలోపేతం చేస్తుంది. సరకు రవాణాను మరింత సులభతరం చేస్తుంది.

ప్రయాణ దూరాన్ని, రవాణా సమయాన్ని, ఖర్చులను తగ్గించే తక్కువ దూరంతో కూడిన, మరింత సమర్థమైన మార్గాన్ని కొత్త రైల్వే లైను అందిస్తుంది. ప్రస్తుతమున్న వార-మానిక్‌గఢ్ సెక్షన్లో రద్దీని తగ్గించేందుకు ఇది ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తుంది. సరకు రవాణా సజావుగా సాగేందుకు దోహదపడుతుంది.

సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం, ఈ ప్రాజెక్టు ప్రారంభమైన తర్వాత ఏడాదికి 6.08 మిలియన్ టన్నుల సరకు రవాణాతో పాటు ఇరువైపులా రోజుకు రెండు 'మెము' రైళ్లు నడిపేందుకు తోడ్పడుతుందని అంచనా. బొగ్గు, కోక్, సిమెంట్, స్పాంజ్ ఐరన్, లోహ వ్యర్థాలు, ఇనుము?ఉక్కు, ఎరువులు, ఆహారధాన్యాలతో సహా ఇతర వస్తువులు సరకు రవాణాలో ఉంటాయని భావిస్తున్నారు.

బొగ్గు, సిమెంట్ క్లస్టర్లకు మజ్రీ?నాందేడ్ మార్గానికి మధ్య ప్రత్యక్ష అనుసంధానాన్ని ఈ కొత్త లైన్ కల్పిస్తుంది. దీనివల్ల మహారాష్ట్ర, కర్ణాటకలోని జల్నా, పర్భాని, ఛత్రపతి శంభాజీనగర్, ఇతర గమ్యస్థానాలకు బొగ్గు, సిమెంటు, ఆర్ఎంఎస్‌పీ రవాణా దూరం తగ్గుతుంది.

రద్దీగా ఉండే బల్హార్ష-నాగపూర్ హై-డెన్సిటీ నెట్‌వర్క్ (హెచ్‌డీఎన్) మార్గంపై ఆధారపడటాన్ని ఈ ప్రాజెక్టు తగ్గిస్తుంది. అలాగే యవత్మల్, చంద్రాపూర్ జిల్లాల్లో సాపేక్షంగా తక్కువ అనుసంధానం ఉన్న ప్రాంతాలకు రైలు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. ఈ మార్గం మెరుగైన రైలు మౌలిక సదుపాయాల ద్వారా ఈ ప్రాంతంలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుంది.

ఈ కొత్త రైలు మార్గం ప్రాంతీయ రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుతుంది. నిత్యావసర వస్తువుల రవాణాను సులభతరం చేస్తుంది. పెరుగుతున్న సరకు రవాణా, ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా అదనపు రైలు కారిడార్‌ను అందిస్తుంది. ఇప్పటికే ఉన్న రైల్వే నెట్‌వర్కును మరింత సమర్థంగా ఉపయోగించుకోవడానికి, పారిశ్రామిక, ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అంచనా.

## పర్యావరణాన్ని కాపాడదాం.. భవిష్యత్తును రక్షిద్దాం- లయన్ వుంద్రు శ్యామ్ బాబు

ఖమ్మం, సెప్టెంబర్ 19:ప్రకృతిని ప్రేమించి పర్యావరణాన్ని కాపాడాలని కంటి హాస్పటల్ నిర్వాహకులు లయన్ వుంద్రు శ్యాంబాబు అన్నారు. మేరీ ఇమిక్యులేట్ హైస్కూల్ ఆధ్వర్యంలో 'పచ్చదనాన్ని కాపాడుతాం మొక్కలు నాటుదాం ' అని అవగాహనతో విద్యార్థులు స్కూలు ప్రధానోపాధ్యాయులు టీచర్ల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్యాంబాబు మాట్లాడుతూ.. స్వచ్ఛదనం పచ్చదనం ఎంతో ముఖ్యమని ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మనిషి ఒక మొక్కను నాటాలని దానిని పరిరక్షించాలని కూడా ఆయన తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు....




ములుగు, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): ఘనంగా బీసీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్, మరియు కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షులు మునిసిపెల్లి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న జన్మదిన వేడుకలు.... ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , కిసాన్ సెల్ ములుగు జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింతనీప్పుల బిక్షపతి మరియు మాజీ మండల అధ్యక్షులు చాంద్ పాషా కాంగ్రెస్ పార్టీ జిల్లా రథసారథి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ పైడాకుల అశోక్ అన్న జన్మదిన వేడుకలు ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద బిసి సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీ ములుగు మండల అధ్యక్షులు మునిసిపెల్లి కుమార్ , ములుగు పట్టణ అధ్యక్షులు లావుడ్య రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి అశోక్ అన్న మంచి మనస్సు మరియు సేవా దృక్పథం కలిగిన నాయకుడని ఎల్లప్పుడూ ప్రజలు మరియు కార్యకర్తల కష్టసుఖాలలో పాలుపంచుకునే తత్వం కలవాడని, అశోక్ అన్న ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, వారి జీవితంలో ఎన్నో ఉన్నతమైన పదవులను అధిరోహించాలని సందర్భంగా వారు అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వల్లె జయపాల్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ రియాజ్ మీర్జా, కౌన్సిలర్లు పొడాల ఓం ప్రకాష్, గుంటోజు పావని కుత్బుద్దిన్ కేశెట్టి నవీన్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్లు షర్ఫుద్దీన్, మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆస్పత్రికి సిరెంజెస్ దానం

ఖమ్మం, సెప్టెంబర్ 19:పేదలకు వైద్య సేవలు మరింత అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చింతకాని మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆస్పత్రికి శనివారం సిరెంజెస్‌ను దానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజలు ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిరెంజెస్ దానం చేయడం అభినందనీయమని డాక్టర్ అల్తాఫ్ అన్నారు. కార్యక్రమంలో చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, కాంగ్రెస్ వందనం గ్రామ శాఖ అధ్యక్షుడు పొన్నం శంకర్రావు, ఉపాధ్యక్షుడు ఎస్కే మోయిన్, గ్రామ పెద్దలు కామసాని శంకర్‌రావు, టీడీపీ నాయకులు బండి ప్రసాద్, గడ్డం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# రోగిని కాపాడడానికి సువ్యవస్థిత, కాల బద్ధ నాణ్యతాపరమైన హామీ విధానాన్ని అనుసరించడం కీలకమన్న అదనపు కార్యదర్శి, ఎన్‌హెచ్ఎమ్ మిషన్ డైరెక్టరు శ్రీమతి ఆరాధన పట్నాయక్

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ '2026 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవా'న్ని న్యూఢిల్లీ లోని ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యు సభాభవనంలో నిర్వహించింది. ఈ సంవత్సరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి "అసాంక్రామిక వ్యాధుల (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్.. ఎన్‌సీడీస్) విషయంలో సురక్షిత సంరక్షణ"ను ఇతివృత్తంగా స్వీకరించారు. ఎన్‌సీడీ విషయం రోగుల భద్రత, సంరక్షణకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలను మరింత బలపరచడం జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశంగా ఉంది. ఈ కార్యక్రమంలో విధాన రూపకర్తలు, ఆరోగ్యసంరక్షణ రంగ ప్రముఖులు, ప్రజారోగ్య నిపుణులు, చికిత్సకులు, నాణ్యత మేనేజర్లు, అభివృద్ధి భాగస్వాములు, రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.




ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖలో అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎమ్) మిషన్ డైరెక్టరు శ్రీమతి ఆరాధన పట్నాయక్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, రోగుల భద్రతను పటిష్టపరచడానికి, సంరక్షణ సంబంధిత నాణ్యతను మెరుగుపరచడానికి, దేశమంతటా సురక్షిత ఆరోగ్య వ్యవస్థలను తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. రోగి భద్రత ఏ ఒక్క కార్యక్రమం గాని, లేదా విభాగం బాధ్యతో కాబోదని, దీనిని సంపూర్ణ ఆరోగ్య వ్యవస్థలో.. మరీ ముఖ్యంగా, ఒకరి నుంచి మరొకరికి సోకని దీర్ఘకాలిక అనారోగ్యాల (ఎన్‌సీడీఎస్)ను అరికట్టడం, రోగనిర్ధారణ చేయడం, చికిత్సను అందించడం, వ్యాధిగ్రస్తులను దీర్ఘకాల ప్రాతిపదికన సంరక్షించడం వంటి రంగాల్లోకి సేవలను విస్తరించాల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

అంటువ్యాధులు కాని రకానికి చెందిన వ్యాధులు, ఉదాహరణకు.. గుండెపోటు, పక్షవాతం, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్లు వంటి వాటి వల్ల బాధితులవుతున్న వారి సంఖ్య అంతకంతకు పెరుగుతోందని శ్రీమతి పట్నాయక్ ప్రస్తావించారు. భారత్‌లో దాదాపు 63 శాతం మరణాలకు ఇవే కారణమవుతున్నాయని, దీంతో ఆరోగ్య సేవలను అందించడంలో రోగులను రక్షించడం ఒక ముఖ్య భాగంగా మారిందని ఆమె తెలిపారు. ప్రజారోగ్య సంరక్షణ రంగంలో ఇటీవలి విజయాల గురించి ఆమె మాట్లాడుతూ.. 96 శాతం టీకాకరణ, 90.6 శాతం సంస్థాగత ప్రసవాలు ప్రజారోగ్య కేంద్రాల్లోనే పూర్తి అయ్యాయన్న సమాచారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్)లో వెల్లడి అయిందన్నారు. ఆరోగ్య సంరక్షణ సంస్థలలో నాణ్యమైన, భద్రమైన పద్ధతులను అనుసరించడం.. మరీ ముఖ్యంగా రోగికి రెఫరల్ సేవలను, సంరక్షణ సేవలను నిరంతరాయంగా అందించడాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. అదే జరిగితే, సకాలంలో చక్కని సేవలు అందించడం వల్ల మెరుగైన ఆరోగ్య ఫలితాలను సాధించవచ్చన్నారు.

నాణ్యతను మెరుగు పరిచే దిశగా వేగవంతమైన ప్రయత్నాలు చేపట్టాల్సిందిగా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు శ్రీమతి పట్నాయక్ పిలుపునిచ్చారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్-సబ్ హెల్త్ సెంటర్ల (ఏఏఎమ్-ఎస్‌హెచ్‌సీస్)లో నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో 100 శాతం ఫలితాలను సాధించడానికి ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పాటు ఆ ప్రణాళికను అమలు పరచడానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాల్సి ఉందని ఆమె సూచించారు. అన్ని స్థాయిల్లో రోగి భద్రతకు పూచీపడే సంస్కృతికి సంస్థాగత రూపురేఖలను ఇవ్వడానికి గాను నాణ్యత హామీ పట్ల సువ్యవస్థిత, కాల బద్ధ దృష్టికోణాన్ని అవలంబించాల్సి ఉంటుందని శ్రీమతి పట్నాయక్ స్పష్టం చేశారు.

ప్రారంభ కార్యక్రమం ముగింపులో.. జాతీయ స్థాయిలో రోగి భద్రత సంబంధిత ప్రతిజ్ఞ పాఠాన్ని అందరి చేత చదివింపచేశారు. ఈ ప్రతినను పూని, దేశం నలుమూలలా ఆరోగ్య సంరక్షణ సేవలను అందరికి అందుబాటులోకి తీసుకురావడంలో నాణ్యత బలోపేతానికి ఆరోగ్య సేవల రంగంలోని ఆసక్తిగల వర్గాలన్నీ సామూహిక నిబద్ధతతో పనిచేస్తాయని పునరుద్ఘాటించినట్లయింది.

తదనంతరం చేపట్టిన సాంకేతిక కార్యక్రమంలో, "అసాంక్రామిక వ్యాధుల (ఎన్‌సీడీస్) విషయంలో సురక్షిత రీతులలో సంరక్షణ" అంశంపై ప్రత్యేక చర్చాసభను నిర్వహించారు. దీనిలో ఎన్‌సీడీ సంరక్షణ తాలూకు వివిధ దశలలో రోగి భద్రతతో ముడిపడిన ప్రధాన సవాళ్లు, తీసుకోవలసిన చర్యలపై నిపుణులు మేధోమథనం చేశారు. చర్చలలో.. ఎన్‌సీడీ సంరక్షణ ప్రక్రియలో ఎదురయ్యే నష్ట భారం, రోగి భద్రతే లక్ష్యంగా డిజిటల్ స్వాస్థ్య ప్రణాళికను పక్కాగా అమలుచేయడం, సహ-వ్యాధిగ్రస్తతలపై ప్రత్యేక దృష్టి పెడుతూ రోగనిర్ధారణ ప్రక్రియలలో సురక్షిత రీతిన ఎన్‌సీడీ సంరక్షణను అందించడం, ఎన్‌సీడీల ప్రభావితులను కాపాడడంలో ఔషధాల ఉపయోగంలో తగిన జాగ్రత్త చర్యలను తీసుకోవడం వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

కార్యక్రమంలో ఆ తరువాత, వివిధ రాష్ట్రాలలో రోగి రక్షణను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణకు దిగడానికి, నాణ్యతను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన కార్యక్రమాలపై చర్చిస్తూ, విధానాన్ని అమలులోకి తీసుకురావడంపై కూడా దృష్టి సారించారు. కార్యక్రమంలో పాలుపంచుకున్న రాష్ట్రాల స్థాయిలో నూతన ఆవిష్కరణలను, అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలియజెప్పుకొన్నారు. ఈ సందర్భంగా :

ప్రస్తావనకు వచ్చాయి. ఈ అనుభవాలు ఆరోగ్య సేవల అందజేతలో వివిధ స్థాయిలలో రోగి సంరక్షణను బలోపేతం చేయడానికి గాను సందర్భం వారీ విధానాలు, జ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకోవడం, చక్కని ఫలితాలనిచ్చే పద్ధతులను అవలంబించడం ముఖ్యమని చాటాయి.

నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్), జాతీయ రోగి భద్రత అమలు సంబంధిత ప్రాథమిక ప్రణాళిక (ఎన్‌పీఎస్ఐఎఫ్) వంటి కార్యక్రమాల ద్వారా నాణ్యత, రోగి సంరక్షణల కోసం ఉద్దేశించిన సంస్థాగత ప్రణాళికను భారత్ పటిష్ఠపరుస్తోంది. ఈ నేపథ్యంలో, '2026 ప్రపంచ రోగి భద్రత దినోత్సవ' నిర్వహణ.. ఆసక్తిదారులను ఒక చోటుకు తీసుకురావడానికి, అలాగే అనుభవాలను, అత్యుత్తమ పద్ధతులను పరస్పరం వెల్లడించుకోవడానికి, ఆరోగ్య సేవల అందజేత ప్రక్రియలోని అన్ని స్థాయిల్లో రోగి భద్రతకు పూచీపడే సంస్కృతిని బలోపేతం చేయడానికి కీలక వేదికను సమకూర్చింది.


'అందరికీ ఆరోగ్య పరిరక్షణ సేవల లభ్యత' (యూనివర్సల్ హెల్త్ కవరేజ్.. యూహెచ్‌సీ)లక్ష్యంగా నాణ్యతపూర్వక సంరక్షణను మెరుగుపరచడానికి, రోగి భద్రతను పెంపొందింపచేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరే నిరూపించింది.

ఈ కార్యక్రమం.. చర్చ, జ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకోవడం, ఉమ్మడి కార్యాచరణల ద్వారా ఆరోగ్యసేవల వ్యవస్థల్ని బలోపేతం చేయడంతో పాటు, "ప్రాణాలను నిలబెట్టడానికి సురక్షిత రీతిన సంరక్షణ" అన్న దార్శనికతను ముందుకు తీసుకుపోవడానికి కూడా తోడ్పడింది.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (ఎమ్ఓహెచ్ఎఫ్‌డబ్ల్యూ)తో పాటు భాగస్వామ్య సంస్థలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వారిలో.. ఎమ్ఓహెచ్ఎఫ్‌డబ్ల్యూ సంయుక్త కార్యదర్శి శ్రీ సిబిన్ సి. , నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ప్రొఫెసర్ (డాక్టర్) ప్రజ్ఞ శర్మ, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎమ్) డైరెక్టరు శ్రీ దీపక్ సోని, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) డైరెక్టరు డాక్టర్ బినోద్ కుమార్ పాత్రో, నాణ్యత,రోగుల భద్రత విషయాల్లో ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీ సలహాదారు డాక్టర్ రాజీవ్ పత్ని ఉన్నారు. విధాన రూపకర్తలు, ఆరోగ్యసంరక్షణ రంగ ప్రముఖులు, సాంకేతిక నిపుణులు, అభివృద్ధి భాగస్వాములు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

'ప్రపంచ రోగి భద్రత దినోత్సవం' గురించి..

వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఆమోదముద్ర వేయడంతో, ఏటా సెప్టెంబర్ 17న 'ప్రపంచ రోగి భద్రత దినోత్సవా'న్ని పాటిస్తున్నారు. సురక్షిత ఆరోగ్య సేవల పట్ల చైతన్యాన్ని పెంపొందింపచేయడం, కార్యాచరణను ప్రోత్సహించడం కోసం ఓ అంతర్జాతీయ వేదికగా ఇది స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. "అసాంక్రామిక వ్యాధుల (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్.. ఎన్‌సీడీస్) విషయంలో సురక్షిత రీతిన సంరక్షణను అందించడా"న్ని ఈ సంవత్సరంలో ఇతివృత్తంగా తీసుకున్నారు. వ్యక్తుల నుంచి వ్యక్తులకు వ్యాపించని రోగాల సంరక్షణ ప్రక్రియలో ఎదురుకాగల నష్టాలను అడ్డుకోవడానికి ప్రాధాన్యాన్నివ్వాలని ఇది సూచించింది.



# శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు జాబితా పునఃసిద్ధీకరణకు షెడ్యూల్ విడుదల

## అర్హత కలిగిన పట్టభద్రులు ఫారం-18లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.




ములుగు, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ శాసన మండలిలోని పట్టభద్రుల నియోజకవర్గాల ఓటరు జాబితా పునఃసిద్ధీకరణ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.

ఓటరు జాబితా పునఃసిద్ధీకం ణలో భాగంగా అర్హత కలిగిన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేందుకు నిర్ణీత గడువులోగా ఫారం-18లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ ప్రక్రియలో అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలతో జాబితాను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28నుండి నవంబర్ ఆరో తేదీ వరకూ 01/11/2026 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కనీసం 3 సంవత్సరాలు పూర్తవ్వాలిని తెలిపినారు.

సాధారణ శాసనసభ/ సార్వత్రిక ఎన్నికల్లాగా ఈ ఓటర్ల జాబితా శాశ్వతం కాదని ప్రతి ఎన్నికకూ మునుపటి ఓటర్ల జాబితా రద్దవుతుంది, కాబట్టి గతంలో ఓటు హక్కు ఉన్నవారైనా తప్పనిసరిగా కొత్తగా ఫారం-18 ద్వార దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపినారు.

అర్హత కలిగిన పట్టభద్రులు తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, పట్టభద్రుల నియోజకవర్గం ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత గడువులోగా ఫారం?18 సమర్పించాలని కోరారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో సమర్పించాలని, ఓటరు జాబితా పునఃసిద్ధీకరణకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.

# సమయాన్ని వృధా చేయడం అభివృద్ధిని అడ్డుకోవడమే

## లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు



హైదరాబాద్, సెప్టెంబర్ 19:తమకు అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోకుండా వృధా చేయడం మన వ్యక్తిగత అభివృద్ధిని అడ్డుకోవడమే అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ముఖ్య అతిథి లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ రోజు సిర్పూర్ కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అంశాన్ని చర్చించి మాట్లాడుతూ ఉన్నత పాఠశాల వరకు మనం అభ్యసించిన విద్య మన ఎదుగుదలకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. పాఠశాల విద్య అనంతరం మన ఆసక్తిని బట్టి ఇంటర్ మీడియట్ కోర్సులను ఎంపిక చేసుకోవలసి వస్తుందని, అందుకు గాను పాఠశాల స్థాయిలోనే నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. చదువుతో పాటు సంస్కారం, విద్యతో పాటు వినయ వివేకాలను పెంపొందించుకోవడం తప్పనిసరి అని తెలిపారు. మన వ్యక్తిగత బలాలు, బలహీనతలు తెలుసుకొని సన్మార్గంలో నడవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. చదువు, డిగ్రీలు ఉద్యోగ ఉపాధు కోసం మాత్రమే కాదని, మన వ్యక్తిత్వ పరిపక్వతకు మన విద్య ఉపయోగపడాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా హాజరైన లయన్ ఇనుగుర్తి రమేష్ మాట్లాడుతూ ఉత్తమ గుణగణాలు విద్యార్థి దశలోనే అలవడాలని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు క్రమంగా నాయకత్వ లక్షణాలు, సంభాషణా నైపుణ్యాలు, ఉద్యోగ సాధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. సభాధ్యక్షత వహించిన ఇంచార్జి హెచ్‌ఎం లయన్ కాళిదాస్ మాట్లాడుతూ పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా మధుసూదన్ రెడ్డి, విశిష్ట అతిథి రమేష్‌లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.

# 'విద్యలో రాణించేలా తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి'

## -నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సర్పంచ్ బానోత్ సరోజ




ఖమ్మం, సెప్టెంబర్ 19: విద్యలో రాణించాలే తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం సర్పంచ్ బానోత్ సరోజ అన్నారు. శనివారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు బోధించే పాఠ్యాంశాలే కాకుండా ఇంటి వద్ద తమ పిల్లలకు అన్ని విషయాల్లో తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని, టీవీ, మొబైల్ ఫోన్‌కు దూరం ఉంచి చదువుపై శ్రద్ధ చూపేలా చూడాలన్నారు. స్వచ్ఛతకు సంబంధించి పాఠశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో యదుసింహారాజు సమక్షంలో సర్పంచ్ సొంత ఖర్చుతో బహుమతులు అందజేశారు. గెలిచిన విజేతలకే కాకుండా పోటీలో ఉన్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులు అందించారు. అనంతరం గ్రామంలో మరమ్మతులకు గురైన చేతి పంపులకు పంచాయతీ సిబ్బందితో మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చేకూరి రవి , పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలకి మెరుగైన సేవలు అందించాలి..

## -ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలి
## -సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించిన ఎమ్మెల్యే- ఎమ్మెల్యే నాయకర్

అమరావతి, సెప్టెంబర్ 19: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో బాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఉద్యోగులకు సూచించారు. ఇంటింటికి నాయకర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని 5వవార్డులో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలుపై ఆరా తీశారు.

ఇందులో భాగంగానే సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయలను ఆయన విజిట్ చేసారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కార్యాలయాలలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందాల్సిన సేవల్లో ఎలాంటి జాప్యం లేకుండా సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. కార్యా లయాలలోని రికార్డులు, పత్రాలను, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి సత్వర సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలపై ప్రజాభిప్రాయం సరిగా లేదని,

దానిని మెరుగు పరుచుకోవాలని ,ఆఫీసు పని టైమ్ లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఉద్యోగులకు సూచించారు . కార్యాలయఆవరణలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంనకు వచ్చిన ఎమ్మెల్యే నాయకర్ కు సబ్ రిజిస్ట్రార్ జీవన్ బాబు, సీనియర్ అసిస్టెంట్ నిరంజన్ లు పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. తహసీల్దార్ కార్యాలయంలో వి ఆర్ ఓ లు మిరియాల లక్ష్మీ నారాయణ, చిరంజీవి లు ఎమ్మెల్యే నాయకర్ కు కార్యాలయం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, జనసేన నాయకులు , వీర మహిళలు ఉన్నారు.

# అమీన్‌సాహెబ్‌పాలెంలో నూతన పంచాయతీ భవనం ప్రారంభం

## గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



అమరావతి, సెప్టెంబర్ 19:పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో రూ. 32 లక్షల మహాత్మా గాంధీ జాతీ1యు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై వారు చర్చించారు.

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కేవలం ప్రజాప్రతినిధుల వల్లే కాకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. గతంలో నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ తాగునీటి పథకానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ నిధులు తీసుకువచ్చామని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేలా పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై ప్రజలు కూడా దృష్టి సారించాలని సూచించారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ తెలిపారు. పొలాల నుంచి ఇళ్లకు ఉచితంగా మట్టి తరలించుకోవచ్చని, ఇందుకు ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తే ఎమ్మెల్యేకు లేదా తనకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో సుమారు 250 కిలోమీటర్ల మేర పొలాల బాటలు, రహదారుల అభివృద్ధి పనులు పూర్తిచేశామని తెలిపారు.

జాతీయ రహదారి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని, ప్రాంతాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించాలని ఎంపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : ఇల్లెందు డీఎస్పీ వెంకన్నబాబు

ఖమ్మం, సెప్టెంబర్ 19: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇల్లెందు డీఎస్పీ వెంకన్నబాబు అన్నారు. శనివారం ఇల్లెందు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మాటాడుతూ.. రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.

ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీఎస్పీ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, సత్యనారాయణ, ఎస్ఐలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు.. కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన ఈడీ

తిరుపతి. సెప్టెంబర్ 19:పవిత్ర తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగానికి సంబంధించిన కేసులో కీలక నిందితుడిని హైదారాబాద్‌కు చెందిన ఈడీ అరెస్టు చేసింది. కైలాష్ చంద్ మంగళ అనే నిందితుడిని మనీలాండరింగ్ యాక్ట్, 2002 కింద సెక్షన్ 19 ప్రకారం శుక్రవారం ఈడీ అరెస్టు చేసింది. కైలాష్ చంద్‌ను ఈడీ అధికారులు ఏపీ, విశాఖలోని స్పెషల్ కోర్టులో హాజరుపర్చగా.. కోర్టు అతడికి జ్యుడీషియల్ కస్టడీ విధించింది.ఉ వ నీ ణ తీ జీ జూ ష్ట్ర తి ఇ ఖీవటవతీవనిఇవ

తిరుపతి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసు విచారణ జరుపుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి నెయ్యి సరఫరా చేసే అంశంలో నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి వంటి ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. నెయ్యిలో కల్తీ జరిగింది అనే ఆరోపణలపై ఈడీ విచారణ జరుపుతోంది. 2019-2024 వరకు టీటీడీకి రూ.230 కోట్ల విలువైన నెయ్యి సరఫరా జరిగింది. ఇందులో రూ.96 కోట్ల విలువైన నెయ్యి సరఫరాలో అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి.

అది కూడా కైలాష్ చంద్ మంగళ ఆధ్వర్యంలోనే జరిగిందని ఈడీ అంచనా వేస్తోంది. సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్ అయిన కైలాష్ చంద్.. ఈ కంపెనీ నుంచే నెయ్యి సరఫరా చేశాడు. ఈ కేసులో కీలక నిందితుల్లో ఒకడిగా ఉన్నాడు. ఈ కేసులో తప్పుడు రికార్డుల్ని కూడా కైలాష్ నిర్వహించినట్లు ఈడీ గుర్తించింది. టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో ఈడీ ఇంతకుముందు విపిన్ జైన్ అనే నిందితుడిని కూడా అరెస్టు చేసింది. అతడు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోటర్‌గా ఉన్నాడు.

# బూర్గంపహాడ్ ఏఎస్ఐగా స్వామి బాధ్యతల స్వీకరణ

ఖమ్మం, సెప్టెంబర్ 19: బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న రెంటపల్లి స్వామి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన బూర్గంపహాడ్ పోలీస్టేషన్‌లో ఏఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన స్వామిని ఎస్ఐలు మేడా ప్రసాద్, నాగభిక్షం, రామ్మూర్తి, స్టేషన్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# 'వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి'

## -నరసింహపురం సర్పంచ్ రామకోటారెడ్డి




ఖమ్మం, సెప్టెంబర్ 19: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపొందించడమే ఏకైక మార్గమని, వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ శీలం రామకోటారెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం నరసింహపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. మొక్కలకు సకాలంలో నీరు అందించడం, రక్షణ కల్పించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. మొక్క నాటితే బాధ్యత తీరినట్లు కాదని.. అది మహావృక్షంగా ఎదిగే వరకు కాపాడినప్పుడే వన మహోత్సవానికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులు వన మహోత్సవంలో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద, పాఠశాల ఆవరణల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రస్తుతం పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గామాను జోగయ్య, ఉపాధ్యాయురాలు కనకదుర్గ, బీఆర్ఎస్ నాయకులు మేరుగుమల్ల కృపారావు, కాళేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మనం అత్యంత విధ్వంసకర శక్తిగా మారాలి.. సైన్యానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశం..!

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 19: ఉత్తర కొరియా (ఔనీతీబిష్ట్ర ఐనీతీవజీ) అధినేత కిమ్ జోంగ్ ఉన్ (ఐతిఎ ఏనీనిణ-బీని) తమ దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ఆదేశాలు జారీచేశారు. తమ ఫిరంగి దళాలు (ఆర్టిలరీ) అత్యంత కేంద్రీకృత, విధ్వంసకర సామర్థ్యాలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన పలు కీలక ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. ఈ పర్యటన వివరాలను ఉత్తర కొరియా అధికారిక మీడియా వెల్లడించింది.

కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ)' కథనం ప్రకారం.. రూలింగ్ వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పాక్ జోంగ్ చోన్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు కిమ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని నిరోధించడం, యుద్ధంలో పోరాడటం అనే రెండు కీలక బాధ్యతలను మన ఆర్టిలరీ సమర్థంగా నిర్వర్తించాలి. దీని కోసం అత్యంత విధ్వంసకర, బహుముఖ దాడి సామర్థ్యాన్ని కలిగి ఉండాలి" అని స్పష్టం చేశారు.

ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించాలనే పార్టీ వ్యూహాత్మక విధానంలో ఆయుధ పరిశ్రమ కీలకపాత్ర పోషించాలని కిమ్ ఉద్ఘాటించారు. దాడి, రక్షణ ఆయుధాలలో కృత్రిమ మేధ (ఏఐ) స్థాయిని పెంచడం, ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి విధానపరమైన పనులను ఆయన నిర్దేశించారు. కిమ్ 600 ఎంఎం, 240 ఎంఎం మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, డ్రోన్‌లను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలను సందర్శించి ఉండవచ్చని సియోల్‌కు చెందిన కొరియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఫోరమ్ సెక్రటరీ జనరల్ షిన్ జోంగ్-వూ విశ్లేషించారు.

కాగా దక్షిణకొరియా, అమెరికా, జపాన్ దేశాలు ఇటీవల నిర్వహించిన త్రైపాక్షిక సైనిక విన్యాసాలకు ప్రతిస్పందనగా సెప్టెంబర్ 14న ఉత్తర కొరియా క్షిపణి, ఫిరంగి దళాలతో భారీ ఫైర్‌పవర్ విన్యాసాన్ని నిర్వహించింది. ఈ విన్యాసంలో కొత్త రకం అటాక్ డ్రోన్లు, టాక్టికల్ క్రూయిజ్ క్షిపణులు, భారీ కాలిబర్ రాకెట్ లాంచర్లు, టాక్టికల్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు.

# దేశ రక్షణలో దృఢ కవచం...రైల్వే భద్రతా దళం

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ ఇరవై తేదీన రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపు కుంటారు. ఇది కేవలం ఒక ఆచార పూర్వక ఉత్సవం మాత్రమే కాకుండా, దేశ ప్రజల రక్షణలో ఈ దళం చేసిన సేవలను స్మరించుకునే చారిత్రక సందర్భం. భారతీయ రైల్వేలు దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాజిక జీవనానికి వెన్నెముక వంటివి. రోజూ దాదాపు రెండు కోట్లు ముప్పై లక్షల మంది రైళ్లలో ప్రయాణిస్తారు. ఈ విస్తారమైన రవాణా వ్యవస్థ సజావుగా నడవడానికి భద్రత అత్యంత కీలకాంశం. ఆ భద్రతను కాపాడే బాధ్యతను మోసేది రైల్వే భద్రతా దళమే.

రైల్వే భద్రతా దళ చరిత్రను పరిశీలిస్తే ఇది ఒక శతాబ్దానికి పైగా వ్యాపించినదని గ్రహించవచ్చు. 1850ల కాలంలోనే బ్రిటిష్ పాలకులు రైల్వేలు విస్తరించడంతో దొంగతనాలు, దాడులు ఎక్కువ కావడం గమనించి ప్రత్యేక భద్రతా సిబ్బందిని నియమించారు. కాలక్రమేణా ఈ అవసరం మరింత పెరిగింది. చివరకు 1957లో భారత పార్లమెంట్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చట్టాన్ని ఆమోదించి దీనికి చట్టబద్ధ హోదా కల్పించింది. ఆ సమయంలో ప్రధాన కర్తవ్యం రైల్వే ఆస్తులను రక్షించడం మాత్రమే. కానీ ప్రయాణీకుల సంఖ్య పెరుగుతుండటంతో, నేరాల విస్తరణ ఎక్కువ కావడంతో ఈ దళం పనితీరు మరింత విస్తరించింది. 1985లో పార్లమెంట్ చట్ట సవరణల ద్వారా రైల్వే భద్రతా దళం కేంద్ర సాయుధ బలగ హోదాను పొందింది. 1999లో కేంద్ర ప్రభుత్వం దీనికి పరామిలిటరీ బలగ స్థాయి కల్పించింది. ఈ రోజు దాదాపు డెబ్బై ఐదు వేల మందికి పైగా సిబ్బందితో ఈ దళం భారతీయ రైల్వేలను కాపాడుతోంది.

రైల్వే భద్రతా దళ ప్రధాన బాధ్యత ప్రయాణికులు, వారి ఆస్తులు, రైల్వే ఆస్తులు సురక్షితంగా ఉండేలా చూడడం. రైళ్లలో దొంగతనాలు, దోపిడీలు, మహిళలపై వేధింపులు, స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణా, ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం వీరి ప్రధాన కర్తవ్యం. మహిళలు, పిల్లలు, వృద్ధుల రక్షణకు

## సెప్టెంబర్ 20...రైల్వే భద్రతా దళ వ్యవస్థాపక దినోత్సవం




ప్రత్యేక శ్రద్ధ చూపుతూ "ఆపరేషన్ యాత్రి సురక్ష", "మెరా సురక్షా", "సురక్షిత్ సఫర్" వంటి ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. తప్పిపోయిన పిల్లలను కనుగొని తల్లిదండ్రులకు అప్పగించడం, రైల్వే ప్రాంగణంలో నిరుపేదలకు సహాయం చేయడం వంటి మానవతా సేవలను కూడా ఈ దళం చేస్తోంది. రైల్వే పట్టాలు, స్టేషన్లు, సిగ్నలింగ్ వ్యవస్థలు వంటి ఆస్తులను విధ్వంసక చర్యల నుండి కాపాడడం కూడా వీరి ప్రధాన కర్తవ్యాల్లో ఒకటి.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి రావడంతో రైల్వే భద్రతా దళం తన పనితీరులో విప్లవాత్మక మార్పులు తెచ్చుకుంది. సీసీటీవీ పర్యవేక్షణ, ఆధునిక ఆయుధాలు, కుక్కల దళం, సైబర్ నేరాల పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారు. ఉగ్రవాద ముప్పులు, బాంబు బెదిరింపులు వంటి పరిస్థితులను ఎదుర్కోవడంలో వీరి పాత్ర విశేషం. రైల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాలను రక్షించడం, బాధితులకు సహాయం చేయడం, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి బాధ్యతలను కూడా వీరు నిర్వర్తిస్తున్నారు.

వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ దళం ఘనంగా వేడుకలు జరుపుకుంటుంది. ప్రధాన కార్యాలయం నుండి జోనల్ కార్యాలయాల వరకు కవాతులు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విధుల్లో విశేష సేవలు అందించిన సిబ్బందికి పతకాలు, బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ వేడుకలు ప్రజల్లో అవగాహన పెంపుతో పాటు సిబ్బందిలో గర్వాన్ని నింపుతాయి.

భారతీయ రైల్వేలు ప్రతి రోజు కోట్లాది మంది ప్రయాణికుల జీవితాన్ని ముడిపెట్టు కున్నాయి. ఈ విస్తారమైన వ్యవస్థ భద్రతను కాపాడే రైల్వే భద్రతా దళం ప్రాముఖ్యత అపరిమితమైనది. "ప్రజల భద్రత ? దేశ భద్రత" అన్న నినాదంతో క్రమశిక్షణ, ధైర్యం, సేవా తపనలతో పనిచేస్తూ ఈ దళం దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ దళం చేసిన త్యాగాలను, అందించిన సేవలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యమే.

రైల్వేలు సురక్షితంగా ఉండడం అంటే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడమేనని గుర్తు చేసే పాఠమిది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలి

## -ప్రధాని మోదీకి లేఖ రాసినమాజీ ఎంపీ గొట్టె భూపతి

కరీంనగర్, సెప్టెంబర్ 19: (నేటినిజం ప్రతినిధి) పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎంపీ గొట్టె భూపతి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాశారు. పెద్దపల్లి ప్రాంతంలో సింగరేణి కాలరీస్,ఎన్టీపిసి,ఎరువుల కర్మాగారంతో పాటు ఎన్నో భారీ పరిశ్రమలు నెలకొని ఉన్న విషయాన్ని ఆయన తన లేఖలో ప్రస్తావించారు. వీటితోపాటు చిన్న,మధ్య తరహా పరిశ్రమలలో తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా దేశం నలుమూలల నుంచి ఎంతో మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చి స్థిరప డ్డారని మాజీ ఎంపీ భూపతి ప్రధానికి రాసిన లేఖలో వివరించారు. అనేక పరిశ్రమలకు పాలవాళంగా మారిన ఈ ప్రాంతంలో దశాబ్దాల నుంచి స్థిర నివాసం ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్న వారు కూడా ఉన్నారని ఉదాహరణలతో పేర్కొన్నారు. ఉద్యోగులు, కార్మికుల పిల్లలు ప్రైవేటు కాలేజీలు, విద్య సంస్థల్లో చేరడానికి చాలా సమస్యలున్నాయని, అందులో ప్రధానమైనది ఆర్థిక సమస్య అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక కుటుంబాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో సెంట్రల్ వర్సిటీని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని పరిశ్రమలు, సంస్థలతోపాటు ప్రైవేటు పరిశ్రమలు, సంస్థల్లో వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. వీరందరినీ దృష్టిలో పెట్టుకుని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలని ఆయన ప్రధానిని కోరారు. ఆవశ్యకత ఎంతైనా ఉంది.ఈ విషయంపై దృష్టి సారించి, పారిశ్రామిక పట్టణంగా గుర్తింపు పొందిన పెద్దపల్లి లేదా గోదావరిఖని ప్రాంతాల్లో సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ గొట్టె భూపతి ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంబాపురం సహా 8 గ్రామాలకు కృష్ణా జలాలు..

## -శాశ్వత పరిష్కారంపై దృష్టి: ఎమ్మెల్యే యార్లగడ్డ

విజయవాడ సెప్టెంబర్ 19: విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం సహా 8 గ్రామాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. శనివారం అంబాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు.

అంబాపురం సహా విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని యార్లగడ్డ తెలిపారు. ముఖ్యంగా అంబాపురంలో నీటిలో టీడీఎస్ స్థాయి అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 3000కుపైగా టీడీఎస్ ఉండటంతో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కృష్ణా నది సమీపంలో ఉన్నప్పటికీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందకపోవడం బాధాకరమన్నారు.

అంబాపురం సహా సమస్య ఎదుర్కొంటున్న 8 గ్రామాలకు కృష్ణా జలాలు అందించేందుకు అధికారులు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం ఉన్న పైపులైన్‌ను అనుసంధానం చేస్తే సుమారు ××రూ.2.05 కోట్లతోనే తాగునీరు అందించే అవకాశం ఉందన్నారు.

కృష్ణా నది నుంచి నేరుగా కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే సుమారు రూ.200 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అంత భారీ మొత్తాన్ని ఖర్చు చేయకుండా తక్కువ వ్యయంతోనే శాశ్వత పరిష్కారం చూపించే మార్గాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈ చర్యల ద్వారా సుమారు 1.55 లక్షల నుంచి 1.80 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు.

తాగునీటి సమస్యను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోనూ చర్చిస్తానని యార్లగడ్డ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ముందే సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. విజయవాడ రూరల్ మండలానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

అంబాపురం గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఇప్పటికే సుమారు రూ.3.19 కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇంకా రూ.5?6 కోట్ల వరకు నిధులు అవసరమని చెప్పారు. దశలవారీగా నిధులు సమకూర్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. క్రికెట్ మైదానం అభివృద్ధి, వాటర్ ట్యాంకు, జన్మభూమి రహదారి తదితర పనులను కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం అంబాపురం 5వ లైన్‌లోని శృతి నివాస అపార్ట్మెంట్‌లో కరెన్న శ్రీ గణేశా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పండుగల సందర్భంగా నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత ఆత్మీయతను పెంపొందిస్తాయి..



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు. వేములవాడ పట్టణంలో శనివారం పలు యూత్ ల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు× ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గణనాథుని భక్తితో పూజించడంతో పాటు ప్రతిరోజు అన్నదానాలు నిర్వహించడం చాలా సంతోషకరమని యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం చాలా అభినందనీయమని వారన్నారు.పండుగలు కేవలం ఆధ్యాత్మికతకు మాత్రమే పరిమితం కాకుండా సమాజ సేవకు వేదికలుగా నిలవాలని యువత లో సేవా భావం మరింత పెంపొందితే సమాజానికి సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమాలలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు,పలు యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథునికి ప్రత్యేక పూజలు భక్తులకు రవీందర్ రెడ్డి అన్నదానం



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో లయన్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద భక్తుల శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. భక్తులకు ఇదే గ్రామానికి చెందిన సంచార్ కొరియర్ అధినేత గడ్డం రవీందర్ రెడ్డి తన తల్లిదండ్రులు గడ్డం లలితమ్మ - చిన్న రాఘవరెడ్డి పేరున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం రవీందర్ రెడ్డి గ్రామంలో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ సభ్యులు. గ్రామస్తులు. భక్తులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

## స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో శ్రమదానం చేసిన కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం,సెప్టెంబర్ 19: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి, పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర?స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా శనివారం నగరంలోని పాత రైల్వే స్టేషన్ వద్ద నూతన మున్సిపల్ కార్యాలయ భవన ప్రాంగణంలో ప్రత్యేక పారిశుధ్య, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు ప్రాధాన్యతను చాటిచెప్పేలా కలెక్టర్ తన బంగ్లా నుంచి కార్యక్రమం జరిగే ప్రాంతానికి సైకిల్‌పై వచ్చారు. కార్యక్రమంలో అందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం మరింత పెరగాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణను ప్రజల నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో నగర మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వివిఎస్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె. నాగరాజు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అడపా సుబ్రహ్మణ్యం, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి జయరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, ఐసిడిఎస్ పిడి ఐ విమల, కలెక్టరేట్ ఏవో రాధిక తదితర శాఖల అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు.. అదనపు కలెక్టర్ భుజంగరావు

కామారెడ్డి, సెప్టెంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): ప్రస్తుత వానాకాలం సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని, అందుకోసం రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదరపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. 2026-2027 వానాకాలం సీజన్ వరి ధాన్యం సేకరణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోని కాన్ఫరెన్సు హాల్ లో శుక్రవారం అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈసారి సుమారు 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. వీటిలో ఐకేపీ ద్వారా 249 కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వీలుగా గిడ్డంగులను గుర్తించాలన్నారు.

తహసీల్దార్లతో క్షేత్రస్థాయిలో గోడౌన్లను పరిశీలింపజేసి, వాస్తవ నిల్వ సామర్థ్యం గుర్తించాలన్నారు. మార్కెట్ కమిటీలకు చెందిన గోడౌన్లు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్ లలో ఇప్పటికే భద్రపరచి ఉన్న మొక్కజొన్న నిల్వలను వెంటనే తరలించేలా మార్క్ ఫెడ్ అధికారులకు లిఖితపూర్వకంగా కోరాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే కృషి చేయాలని, ఈ విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ధాన్యం దిగుబడులు చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన రకాలకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, పూర్తిస్థాయి మద్దతు ధర పొందేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూర్చాలన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట గోడౌన్లకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాలలో సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించాలన్నారు

# కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్..

అమరావతి, సెప్టెంబర్ 19: రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియా?కడప బైపాస్ అనుసంధాన రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు రూ.304.44 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.

ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. నిధుల కేటాయింపుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.కొప్పర్తి-కడప బైపాస్ కనెక్టివిటీ రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖ?చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో కొప్పర్తి కీలక ప్రాంతంగా ఉందని తెలిపారు.కొత్త రహదారి అందుబాటులోకి వస్తే కొప్పర్తి ఇండస్ట్రియల్ ఏరియాకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, పారిశ్రామిక సరకు రవాణాకు కూడా అనుకూలంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో పాటు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar,
Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.** E-mail :netinijam93@gmail.com.
RNI No.52865/93.